Follow: @ANNTELUGU


02-04-2026

ANN తెలుగు

# మహా పత్రిక

గురువారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 95 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## లక్నో గడ్డపై ఢిల్లీ సంచలనం..

### ఓటమి అంచుల నుంచి సింహ గర్జన!

రిజ్వీ.. పేరు కాదు పెను తుఫాన్!

లక్నో ఆశలపై నీళ్లు చల్లిన ఢిల్లీ యువ సంచలనం


ఉత్కంఠ పోరులో లక్నోను చిత్తుచేసిన ఢిల్లీ క్యాపిటల్స్!

ఢిల్లీ ఖాతాలో మరపురాని సూపర్ విక్టరీ!

**లక్నో, మహా:** ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా జరిగిన ఉత్కంఠ పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ సంచలన విజయం సాధించింది. ఒక దశలో కేవలం 26 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడిన ఢిల్లీని, యువ సంచలనం సమీర్ రిజ్వీ తన అసాధారణ బ్యాటింగ్‌తో గెలుపు తీరాలకు చేర్చాడు. ముందుగా బౌలర్ల సమిష్టి కృషితో లక్నోను తక్కువ స్కోరుకే కట్టడి చేసిన ఢిల్లీ.. ఆపై రిజ్వీ-స్టబ్స్ వీరోచిత పోరాటంతో 6 వికెట్ల తేడాతో ఒంటిచేత్తో చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది.

మిగతా 2లో

**టాప్ న్యూస్**



### మావోయిస్టులు మా రక్తమే..

- కమ్యూనిజం అంతం చేయలేరు
- అమిత్ షా వ్యాఖ్యలపై 'కూనంనేని' ఫైర్

02



### ఢిల్లీలో తెలుగు ఆత్మగౌరవం తాకట్టు

- ఎంపీలంతా మోదీకి కీలుబొమ్మలే!
- రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలేసిన ఎంపీలు
- వైఎస్ షర్మిల నిప్పులు

02



### ఉద్యమ లక్ష్యం నెరవేరలే...

- కాంగ్రెస్, బీఆర్ఎస్ తీరుపై పార్లమెంటులో కిషన్ రెడ్డి భగ్గు

02



# రాష్ట్రపతిగా మోదీ?

## 2027లో సంచలన మార్పులకు అవకాశం

- ఉత్తరప్రదేశ్ ఎన్నికలు ముగిశాక దేశ రాజకీయాల్లో సంచలనాలు
- ఫిబ్రవరి-మార్చిలో యూపీ సహా ఐదురాష్ట్రాల ఎన్నికలు
- జూలై 24వరకు ప్రస్తుత రాష్ట్రపతి పదవీకాలం
- 2027 జూలైలో నూతన రాష్ట్రపతి ఎన్నిక
- జాతీయ రాజకీయాల్లోకి యోగి


(కంది రామచంద్రారెడ్డి)

హ్యాట్రిక్ ప్రైమ్ మినిస్టర్ నరేంద్రమోదీ భారతదేశంలో అత్యున్నత పదవిని అధిష్టించబోతున్నారా? ముఖ్యమంత్రి, ప్రధాని పదవుల తర్వాత ఆ పదవిని కూడా చేపట్టాలని డిసైడ్ అయ్యారా? 2027 దేశ రాజకీయాల్లో సంచలనాలకు నాంది కాబోతున్నదా? భవిష్యత్ రాజకీయ పరిణామాలు, సమీకరణలు ఇవి నిజం కాబోతున్నాయన్న సంకేతాలిస్తున్నాయి. ఒక్క మోదీ నిర్ణయాలే కాక.. దేశ రాజకీయ ముఖచిత్రంలోనూ అనేక సర్ ప్రైజ్ లు ఉండే అవకాశమున్నట్లు తెలుస్తోంది. దేశరాజకీయాల్లో సంచలన మార్పులకు 2027 సాక్షిగా నిలవబోతున్నది. వచ్చే ఏడాది దేశ రాజకీయాల్లో అనూహ్యమార్పులకు అవకాశం కనబడుతోంది. సమీకరణలు, పరిస్థితులు ఈ మార్పుల ప్రచారానికి బలాన్ని చేకూరుస్తున్నాయి. బీహార్ లో నితీష్ ను సీఎంగా తప్పించి.. జాతీయ రాజకీయాలకు తీసుకొచ్చినట్లు అనేక రాష్ట్రాలతో జాతీయస్థాయిలోనూ ముఖచిత్రాలు మారే అవకాశాలున్నాయి.

### ఉత్తరప్రదేశ్ ఎన్నికలు 2027 మార్చిలో..

ఉత్తరప్రదేశ్ తో పాటు గోవా, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్ ఎన్నికలు 2027 ఫిబ్రవరి, మార్చిలో జరగనున్నాయి. ప్రస్తుతం యూపీ సీఎంగా ఉన్న యోగి ఆదిత్యనాథ్ ను ఎన్నికల తర్వాత జాతీయ రాజకీయాల్లోకి తీసుకురావొచ్చన్న ప్రచారముంది. యూపీ ఎన్నికల్లో తిరిగి అధికారం సాధిస్తే.. జాతీయ రాజకీయాల్లో మార్పులకు, భవిష్యత్ కు బీజేపీ హైకమాండ్, ఆర్ఎస్ఎస్ సరికొత్త రోడ్ మ్యాప్ ను అమలుచేసే అవకాశముంది.

మిగతా 2లో




### ఒరాకిల్‌లో ఒకేసారి 30 వేల మంది ఇంటికి...

- వేకువజామునే మెయిల్ ద్వారా పిడుగులాంటి వార్త
- బాధితుల్లో 12 వేల మంది భారతీయులు

**న్యూయార్క్ :** అమెరికాకు చెందిన ప్రముఖ టెక్ దిగ్గజం 'ఒరాకిల్' తన ఉద్యోగులకు ఊహించని షాక్ ఇచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తన సిబ్బందిలో ఏకంగా 30 వేల మందిని ఒకేసారి తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. బుధవారం తెల్లవారుజామున 6 గంటలకే ఉద్యోగుల వ్యక్తిగత మెయిల్ ఐడీలకు టెర్మినేషన్ లెటర్లను పంపడంతో టెక్ లోకం ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

మిగతా 2లో



### ముగింపు దిశగా ఇరాన్ యుద్ధం

- రెండువారాల్లో ఆగిపోతుందన్న ట్రంప్
- లేదన్న నెతన్యాహు.. సీజ్ ఫైర్ కు ఇరాన్ రెడీ

**మహా:** ఇరాన్ యుద్ధం ముగింపుపై అగ్రరాజ్యాల మధ్య విభేదాలు నెలకొన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధం విషయంలో వెనక్కి తగ్గుదాం అంటుంటే.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు

మిగతా 2లో

### రేషన్ కార్డుదారుల్లో 'ఐటీ' వణుకు

- క్షేత్రస్థాయి విచారణతో లబ్ధిదారుల ఆందోళన
- వార్షికాదాయం రూ. 6 లక్షలు దాటితే వేటు తప్పదా
- ఊరూరా జీపీవోల ఆకస్మిక తనిఖీలు
- ఐటీ రిటర్న్ దాఖలు చేసినా అనర్హులేనా? 'రుణాల' కోసమేనంటున్న సామాన్యులు

వివరాలు 2లో



### మోదీ, పినరయి ఒక్కటే...

బీజేపీ ఓట్లు విజయన్‌కు మళ్లించే కుట్ర

కేరళలో సీఎం రేవంత్ రెడ్డి ప్రచారం

**తిరువనంతపురం, మహా:** దక్షిణాది రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ ఇమేజ్‌ను సంపాదించుకున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు కేరళ ఎన్నికల రణక్షేత్రంలో కాంగ్రెస్ తరపున గర్జించారు. ఏఐసీసీ స్టార్ క్యాంపెయినర్‌గా నియమితులైన ఆయన, బుధవారం కేరళలో నిర్వహించిన రోడ్ షోలు, బహిరంగ సభల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేరళ సీఎం పినరయి విజయన్‌లపై విమర్శనాస్త్రాలు సంధించారు. మోదీకి, పినరయికి మధ్య ఎలాంటి తేడా లేదని, వీరిద్దరూ కలిసి కేరళ భవిష్యత్తును అపహరించాలని చూస్తున్నారని రేవంత్ సంచలన ఆరోపణలు చేశారు. ఎస్ఎమ్ లాక్ జంక్షన్ నుంచి ముట్టతార వరకు సాగిన భారీ రోడ్ షోలో పాల్గొన్న ఆయన, కేరళ ప్రజలు విద్యావంతులు, తెలివైన వారని, ఇక్కడ మతతత్వ శక్తులకు తావులేదని స్పష్టం చేశారు.

మిగతా 2లో



### మచిలీపట్నం టు గుంటూరు క్యాపిటల్

మేమొస్తే.. చెన్నైలా మావిగన్ క్యాపిటల్

మా ప్లాన్ బీ మావిగన్.. వైసీపీ అధినేత జగన్ సంచలన వ్యాఖ్యలు

**తాడేపల్లి, మహా :** ఏపీ రాజధాని అమరావతిపై మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజధాని విషయంపై తమ ప్లాన్ ఏ ఫలించలేదని, ప్లాన్ బీ ఏంటో కూడా అందరికీ తెలుసన్నారు. బుధవారం మీడియా సమావేశంలో ప్లాన్ బీ ప్రతిపాదనను జగన్ మీడియాకు తెలిపారు. మచిలీపట్నం నుంచి గుంటూరు

మిగతా 2లో

### అమరావతి ఇక అజేయం.. అజరామరం

- విశ్వనగరంగా తీర్చిదిద్దుతాం
- ఏపీ సీఎం చంద్రబాబు
- లోక్ సభ ఆమోదం.. రాజ్యసభకు చేరిన రాజధాని అమరావతి బిల్లు

**అమరావతి, మహా :** లోక్‌సభలో అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేశారు. అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు తెరపడిందన్నారు. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు.

మిగతా 2లో





# లక్నో గడ్డపై ఢిల్లీ సంచలనం

(మొదటిపేజీ తరువాయి)

లక్నో వేదికగా జరిగిన ఐపీఎల్ 2026 ఉత్కంఠ పోరులో ఢిల్లీ క్యాపిటల్స్ (DC) అద్భుత విజయాన్ని నమోదు చేసింది. తొలుత బౌలింగ్‌లో అదరగొట్టిన ఢిల్లీ.. ఆ తర్వాత లక్ష్య ఛేదనలో తడబడినా రిజ్వీ మరియు స్టబ్స్ జోడీ ఆదుకోవడంతో లక్నో సూపర్ జెయింట్స్ (LSG)పై 6 వికెట్ల తేడాతో గెలుపొందింది.





### లక్నో బ్యాటర్లను వణికించిన ఢిల్లీ బౌలర్లు

టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ ముందుగా ఫీల్డింగ్ ఎంచుకుంది. పిచ్ పరిస్థితిని పసిగట్టిన ఢిల్లీ బౌలర్లు ఆరంభం నుంచే లక్నో బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. మిచెల్ మార్ష్ (35), అబ్దుల్ సమద్ (36) మాత్రమే కాస్త రాణించగా మిగతా బ్యాటింగ్ లైనప్ కుప్పకూలింది. రిషబ్ పంత్ (7), ఐడెన్ మార్క్రమ్ (11), ఆయుష్ బదోని (0) ఘోరంగా విఫలమయ్యారు. లుంగి ఎంగిడి పదునైన బంతులకు స్టార్ బ్యాటర్ నికోలస్ పూరన్ (8) క్లీన్ బౌల్డ్ అయ్యాడు. మిడిల్ ఓవర్లలో కుల్దీప్ యాదవ్ నిలకడగా ఆడుతున్న మార్ష్‌ను అవుట్ చేసి దెబ్బ కొట్టగా.. డెత్ ఓవర్లలో నటరాజన్ యార్కర్లతో విరుచుకుపడ్డాడు. దీంతో లక్నో 18.4 ఓవర్లలో 141 పరుగులకే ఆలౌట్ అయింది.

### మంచు కురిసే వేళ వికెట్ల పతనం.. ఆందోళనలో ఢిల్లీ

142 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీకి లక్నో బౌలర్లు చుక్కలు చూపించారు. ప్రిన్స్ యాదవ్ నిప్పులు చెరిగే బంతులతో ఢిల్లీ టాప్ ఆర్డర్‌ను కకావికలం చేశాడు. కేవలం 5 ఓవర్లు ముగిసే సరికి కీలక ఆటగాళ్లు కేఎల్ రాహుల్ (0), నితీష్ రాణా (15), పథుమ్ నిస్సంక (1), అక్షర్ పటేల్ (0) వరుసగా అవుట్ కావడంతో ఢిల్లీ 26 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది.

### సమీర్ రిజ్వీ మెరుపు ఇన్నింగ్స్.. స్టబ్స్ చక్కని సహకారం

జట్టు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న దశలో 'ఇంపాక్ట్ ప్లేయర్'గా క్రీజులోకి వచ్చిన యువ సంచలనం సమీర్ రిజ్వీ ఎక్కడా ఒత్తిడికి లోనవ్వకుండా లక్నో బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. అతనికి ట్రిస్టన్ స్టబ్స్ నుంచి అద్భుతమైన సహకారం లభించింది. బౌండరీలతో చెలరేగిన రిజ్వీ 47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 70 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మరోవైపు స్టబ్స్ 32 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్సర్‌తో 39 పరుగులతో రాణించాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు ఏకంగా 119 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో.. మరో 17 బంతులు మిగిలి ఉండగానే (17.1 ఓవర్లలో) ఢిల్లీ క్యాపిటల్స్ లక్ష్యాన్ని చేరుకుని ఘన విజయం సాధించింది.

### మ్యాచ్ స్కోరు , బౌలింగ్ వివరాలు

లక్నో సూపర్ జెయింట్స్ (LSG) ఇన్నింగ్స్: 141 ఆలౌట్ (18.4 ఓవర్లలో)
అబ్దుల్ సమద్: 36 పరుగులు (25 బంతుల్లో, 3 ఫోర్లు, 1 సిక్సర్)
మిచెల్ మార్ష్: 35 పరుగులు (28 బంతుల్లో, 2 ఫోర్లు, 3 సిక్సర్లు)
ముకేశ్ చౌదరి: 14 పరుగులు (11 బంతుల్లో)
ఐడెన్ మార్క్రమ్: 11 పరుగులు
నికోలస్ పూరన్: 8 పరుగులు (8 బంతుల్లో)
రిషబ్ పంత్: 7 పరుగులు
మహ్మద్ షమీ: 1 పరుగు (2 బంతుల్లో)
ఆయుష్ బదోని: 0 పరుగులు
అన్రిచ్ నోర్ట్జే: 0 పరుగులు
మొహ్సిన్ ఖాన్: 0 పరుగులు
ఢిల్లీ క్యాపిటల్స్ (DC) బౌలింగ్ ప్రదర్శన:
టి. నటరాజన్: 3 వికెట్లు (29 పరుగులు ఇచ్చి)
లుంగి ఎంగిడి: 3 వికెట్లు (27 పరుగులు ఇచ్చి)
కుల్దీప్ యాదవ్: 2 వికెట్లు (31 పరుగులు ఇచ్చి)
అక్షర్ పటేల్: 1 వికెట్ (17 పరుగులు ఇచ్చి)
ఢిల్లీ క్యాపిటల్స్ (DC) ఇన్నింగ్స్: 145/4 (17.1 ఓవర్లలో)
సమీర్ రిజ్వీ: 70 పరుగులు నాటౌట్ (47 బంతుల్లో, 5 ఫోర్లు, 4 సిక్సర్లు)
ట్రిస్టన్ స్టబ్స్: 39 పరుగులు నాటౌట్ (32 బంతుల్లో, 3 ఫోర్లు, 1 సిక్సర్)
నితీష్ రాణా: 15 పరుగులు
పథుమ్ నిస్సంక: 1 పరుగు
కేఎల్ రాహుల్: 0 పరుగులు
అక్షర్ పటేల్: 0 పరుగులు (1 బంతిలో)
లక్నో సూపర్ జెయింట్స్ (LSG) బౌలింగ్ ప్రదర్శన:
ప్రిన్స్ యాదవ్: 2 వికెట్లు (20 పరుగులు ఇచ్చి)
మోసిన్ ఖాన్: 1 వికెట్ (19 పరుగులు ఇచ్చి)
మహ్మద్ షమీ: 1 వికెట్
మ్యాచ్ ఫలితం: ఢిల్లీ క్యాపిటల్స్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

# రాష్ట్రపతిగా మోదీ?

(మొదటిపేజీ తరువాయి)

ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపదీముర్ము పదవీకాలం జూలై 24, 2027 వరకు ఉంది. దీని ప్రకారం 2027 జూలైలోనే నూతన రాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. హ్యాట్రిక్ ప్రధానిగా నరేంద్రమోదీ భారతదేశంలో అనేక రికార్డులు తనపేరునే లిఖించుకున్నారు. అత్యధిక కాలం ప్రజాప్రతినిధిగా ఉన్న ఏకైక నేతగా, ప్రధానిగా రికార్డు క్రియేట్ చేశారు. 75 ఏళ్ళు కాగానే.. సంఘ్ లెక్కల ప్రకారం ప్రధాని పదవి మరొకరికి అప్పగిస్తారంటూ ప్రచారం చేశారు. కానీ ఎంతో ఉత్సాహంగా.. ఆయన పనిచేసుకుంటూ వెళ్తున్నారు. అయితే మోదీ దేశ రాజకీయాల్లో యాక్టివ్ గా ఉండేలా మరో వ్యూహం సిద్ధం చేసుకున్నారన్న ప్రచారం ఉంది. గుజరాత్ సీఎంగా, ప్రధాని గా అప్రతిహత విజయాలు సాధించిన మోదీ దేశ ప్రథమ పౌరుడిగానూ బాధ్యతలు స్వీకరించి, మునుపెన్నడూ ఎవరూ సాధించిన అరుదైన రికార్డును నమోదుచేసుకోవాలని చూస్తున్నారని వినబడుతోంది. 2027లో యూపీలో మరోసారి బీజేపీ అధికారం సాధిస్తే, 2027 జూలైలో జాతీయ రాజకీయ ముఖచిత్రం మారుతుందని, ప్రధాని మోదీ రాష్ట్రపతి మోదీ అయ్యే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని అత్యున్నత స్థాయి వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ ప్రచారం నిజమేనా? 75 ఏండ్లకు రిటైర్మెంట్ తరహాలాంటిదా? అప్పటి సవాళ్ళను బట్టి నిర్ణయం తీసుకుంటారా? అన్నది వచ్చే ఏడాది తెలుస్తుంది?

### తదుపరి ప్రధానిపైనా చర్చలు

ప్రచారం జరుగుతున్నట్లు నరేంద్రమోదీ రాష్ట్రపతి బాధ్యతలు స్వీకరిస్తే మోదీ వారసుడిగా ఎవరు బాధ్యతలు స్వీకరిస్తారన్న ఆసక్తికర చర్చ కూడా సాగుతోంది. ప్రస్తుతం దేశంలో నెంబర్ 2గా పేరున్న అమిత్ షా, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ పేర్లు ప్రచారంలో ఉన్నాయి. వీటిలో ఏమి జరిగినా.. దేశ రాజకీయ ముఖచిత్రం రానున్న దశాబ్దం విభిన్నంగా ఉండబోతుంది. బీహార్ పాలిటిక్స్ నుండి నితీష్ అనూహ్యంగా వైదొలిగినట్లు దేశ రాజకీయాల్లోనూ మార్పులు అనివార్యమన్న చర్చ ఉంది. బీజేపీ పెద్దల వ్యూహమేంటో ముందుముందు తెలుస్తుంది.

# మావోయిస్టులు మా రక్తమే..

**హైదరాబాద్, మహా:** దేశంలో కమ్యూనిజం ఉన్నంత కాలం మావోయిజాన్ని ఎవరూ అంతం చేయలేరని, మావోయిస్టులు తమ రక్తసంబంధీకులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కేంద్ర ప్రభుత్వ వైఖరిపై, ముఖ్యంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీరుపై నిప్పులు చెరిగారు. దేశంలో మావోయిజాన్ని పూర్తిగా అణిచివేశామని అమిత్ షా సంబరపడుతున్నారని, అయితే మావోయిజానికి మూలమే కమ్యూనిజం అని ఆయన గుర్తుచేశారు. మావోయిస్టులను భౌతికంగా అంతం చేయగలరేమో కానీ, వారిలోని ప్రశ్నించే తత్వాన్ని, ఆ సిద్ధాంతాన్ని అణిచివేయడం ఎవరి తరమూ కాదని స్పష్టం చేశారు. అణచివేత పెరిగే కొద్దీ తిరుగుబాటు మరింత బలంగా మారుతుందని, మేధావులను 'అర్బన్ నక్సల్స్' పేరుతో ఇబ్బందులకు గురిచేయడం మానుకోవాలని హెచ్చరించారు. అమాయకులను, ఆలోచనాపరులను వేధించేందుకు తెస్తున్న నల్ల చట్టాలే రేపు పాలకులకు ఉరితాళ్లుగా మారతాయని కూనంనేని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. లోక్‌సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అత్యున్నత న్యాయవ్యవస్థను బెదిరించేలా ఉన్నాయని కూనంనేని మండిపడ్డారు. రెండు రోజుల క్రితం పార్లమెంటులో అమిత్ షా మాట్లాడుతూ.. సల్వాజుడుం అంశంపై గతంలో జస్టిస్ సుదర్శన్ రెడ్డి సభ్యుడిగా ఉన్న ధర్మాసనం ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును తప్పుపట్టడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హోంశాఖ వంటి బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి, న్యాయమూర్తుల తీర్పులను కించపరుస్తూ మాట్లాడటం రాజ్యాంగ విరుద్ధమని ధ్వజమెత్తారు. న్యాయవ్యవస్థ స్వయంప్రతిపత్తిని దెబ్బతీసేలా కేంద్రం వ్యవహరిస్తోందని, ఇటువంటి వ్యాఖ్యలు హోంమంత్రి స్థాయికి తగవని హితవు పలికారు. ప్రజల పక్షాన నిలిచే తీర్పులను అగౌరవపరచడం ప్రజాస్వామ్యానికే గండమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

# ముగింపు దిశగా ఇరాన్ యుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

మాత్రం అంతం చూద్దాం అని పట్టుబడుతున్నారు. ఇరాన్‌తో ఎలాంటి ఒప్పందం కుదరకపోయినా.. మరో రెండు వారాల్లోనే తమ దాడులను ఆపి యుద్ధం నుంచి వైదొలుగుతామంటూ ట్రంప్ ప్రకటించగా.. మరోవైపు నెతన్యాహు ఇరాన్ ఉగ్రవాద యంత్రాంగాన్ని పూర్తిగా అణచివేసే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. మరోవైపు సీజ్ ఫైర్ కు ఇరాన్ సిద్ధంగా ఉందన్న సంకేతాలు వెలువడుతున్నాయి.

# ఢిల్లీలో తెలుగు ఆత్మగౌరవం తాకట్టు

**అమరావతి: మహా:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి జీవన్మరణ సమస్యగా మారిన ప్రత్యేక హోదా, విభజన హామీల సాధనలో రాష్ట్ర ఎంపీలు ఘోరంగా విఫలమయ్యారని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంటులో రాష్ట్ర గళం వినిపించాల్సిన ఎంపీలు ప్రధాని మోదీ చేతిలో కీలుబొమ్మలుగా, బీజేపీకి బానిసలుగా మారిపోయారని ఆమె మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి, కేవలం స్వలాభం కోసం పాకులాడుతున్న 25 మంది లోక్‌సభ సభ్యులు, 11 మంది రాజ్యసభ సభ్యులు నైతిక బాధ్యత వహించి తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు. బుధవారం లోక్‌సభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై జరిగిన చర్చా సందర్భాన్ని పురస్కరించుకుని సోషల్ మీడియా వేదికగా ఆమె ఎంపీల తీరుపై నిప్పులు చెరిగారు.
లోక్‌సభలో ఆంధ్రప్రదేశ్ విభజన హామీల గురించి, రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం గురించి కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణికం ఠాగూర్ గట్టిగా గళం విప్పిన తీరును షర్మిల అభినందించారు. రాష్ట్ర ప్రజల తరఫున ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూనే, అదే సమయంలో తెలుగు ఎంపీల మౌనాన్ని ఆమె తూర్పారబట్టారు. రాష్ట్ర హక్కుల కోసం ఒక పరాయి రాష్ట్ర నేత పోరాడుతుంటే, ఇక్కడి నుంచి గెలిచిన ఒక్క ఎంపీ కూడా ఆయనకు మద్దతుగా నిలబడకపోవడం తెలుగుగడ్డ చేసుకున్న దౌర్భాగ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. మన ఎంపీలకు రాష్ట్ర ప్రయోజనాల కంటే స్వలాభమే మిన్న అని, పేరుకు వేర్వేరు పార్టీలైనా అందరూ మోదీ భజనపరులేనని ఆమె విమర్శించారు. విభజన జరిగి 11 ఏళ్లు గడుస్తున్నా, బీజేపీ ప్రవేశపెట్టే బిల్లులకు గొర్రెల్లా తలలూపడం తప్ప ప్రత్యేక హోదా ఏమైందని అడిగే దమ్ము ఏ ఒక్క ఎంపీకీ లేదని షర్మిల ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న అన్యాయాన్ని ఎండగడుతూ పలు కీలక అంశాలను ఆమె ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును కేవలం 41 మీటర్లకే పరిమితం చేస్తామని కేంద్రం లిఖితపూర్వకంగా చెబుతున్నా, రాజధాని అమరావతి నిర్మాణానికి ఆర్థిక సాయం చేయలేమని స్పష్టం చేస్తున్నా ఎంపీలు నోరు మెదపకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. విభజన చట్టంలోని హామీలలో ఇప్పటి వరకు కనీసం 5 శాతం కూడా అమలు కాలేదని, ఈ పరిస్థితుల్లోనూ ఎంపీలు మౌనం వహించడం అంటే 'గుడ్డి గుర్రాలకు పళ్లు తోమడమే'నని ఘాటుగా వ్యాఖ్యానించారు. 2014లోనే విభజన హామీల విలువ సుమారు 5 లక్షల కోట్లు అని, అది రాష్ట్రం చేతిలో ఉన్న చెక్కు లాంటిదని ఆమె గుర్తుచేశారు. అయితే మన ఎంపీల అసమర్థత వల్లే ఆ చెక్కును ఎన్‌క్యాష్ చేసుకోలేక రాష్ట్రం తీవ్రంగా నష్టపోతోందని విశ్లేషించారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని, పౌరుషాన్ని ప్రధాని మోదీ కాళ్ల దగ్గర తాకట్టు పెట్టారని షర్మిల ఆరోపించారు. రాష్ట్రానికి ఇంతటి అన్యాయం జరుగుతున్నా ప్రశ్నించే ధైర్యం లేని వారు ప్రజాప్రతినిధులుగా కొనసాగే అర్హత కోల్పోయారని మండిపడ్డారు. ఇప్పటికైనా రాజకీయ ప్రయోజనాలను పక్కనపెట్టి రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడాలని, లేనిపక్షంలో పదవుల నుంచి తప్పుకోవాలని ఆమె హెచ్చరించారు. అమరావతి బిల్లుపై చర్చ సందర్భంగా రాష్ట్ర ఎంపీల అసలు స్వరూపం మరోసారి బయటపడిందని, ప్రజల గొంతుకగా నిలవాల్సిన వారే పాలకుల ముందు మోకరిల్లడం రాష్ట్ర చరిత్రలో ఒక చీకటి అధ్యాయమని ఆమె అభివర్ణించారు.

# ఒరాకిల్‌లో ఒకేసారి 30 వేల మంది ఇంటికి

(మొదటిపేజీ తరువాయి)

ఏమాత్రం ముందస్తు సమాచారం లేకుండా, విధుల్లో చేరకముందే పిడుగులాంటి వార్త వినడంతో వేలాది మంది ఐటీ నిపుణులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఈ భారీ లేఆఫ్స్ ప్రభావం భారతీయ ఐటీ నిపుణులపై తీవ్రంగా పడింది. మొత్తం 30 వేల మంది బాధితుల్లో సుమారు 12 వేల మంది భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది. అటు అమెరికాలోని ప్రధాన కార్యాలయాల్లో పనిచేస్తున్న వారితో పాటు, భారత్‌లోని వివిధ నగరాల్లో ఉన్న ఒరాకిల్ కేంద్రాల్లో పనిచేస్తున్న వారు కూడా పెద్ద సంఖ్యలో ఉద్యోగాలు కోల్పోయారు. కంపెనీ తన మొత్తం సిబ్బందిలో దాదాపు 18 శాతం మందిని తగ్గించుకోవాలని నిర్ణయించుకోవడంతో ఈ స్థాయిలో ఊచకోత తప్పలేదని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నిన్నటి వరకు ఆఫీసు పనుల్లో బిజీగా గడిపిన వారు, ఉదయాన్నే మెయిల్ బాక్స్ తెరిచి చూసేసరికి తమ ఉద్యోగాలు పోయాయని తెలిసి కన్నీటిపర్యంతమయ్యారు.

# మోదీ, పినరయి ఒక్కటే...

(మొదటిపేజీ తరువాయి)

మతతత్వ శక్తులు రాష్ట్రంలోకి రాకుండా కేరళ ప్రజలు ఎప్పుడో 'లక్ష్మణ రేఖ' గీశారని, అయితే ఇప్పుడు పినరయి విజయన్ ద్వారా బీజేపీ తన అజెండాను అమలు చేస్తోందని ఆయన ధ్వజమెత్తారు.
కేరళలో కాంగ్రెస్ మిత్రపక్షాలైన యూడీఎఫ్ గెలవకూడదనే ఏకైక లక్ష్యంతో బీజేపీ తన ఓటు బ్యాంకును వ్యూహాత్మకంగా పినరయి విజయన్‌కు మార్పిడి చేస్తోందని రేవంత్ రెడ్డి ఆరోపించారు. విజయన్ ద్వారా కేరళ భవిష్యత్తును మోదీ తన గుప్పిట్లోకి తీసుకోవాలని చూస్తున్నారని, ఈ కుట్రను ప్రజలు గమనించాలని కోరారు. కేరళ అభివృద్ధి చెందాలంటే కేవలం మాటలు సరిపోవని, పెట్టుబడులు తీసుకువచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే వారికే ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం పశ్చిమ ఆసియాలో సాగుతున్న యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాల్లో ఉంటున్న సుమారు 45 లక్షల మంది మలయాళీలు ఆందోళన చెందుతున్నారని, వారు తిరిగి తమ సొంత రాష్ట్రానికి రావాలని కోరుకుంటున్నారని రేవంత్ పేర్కొన్నారు. అయితే ఇక్కడ పరిశ్రమలు లేకపోవడం, ఉపాధి అవకాశాలు మృగ్యమవ్వడం వల్ల వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని, యూడీఎఫ్ అధికారంలోకి వస్తేనే పెట్టుబడులు, అభివృద్ధి సాధ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# రేషన్ కార్డుదారుల్లో 'ఐటీ' వణుకు

## క్షేత్రస్థాయి విచారణతో లబ్ధిదారుల ఆందోళన

వార్షికాదాయం రూ. 6 లక్షలు దాటితే వేటు తప్పదా
ఊరూరా జీపీవోల ఆకస్మిక తనిఖీలు
ఐటీ రిటర్న్స్ దాఖలు చేసిన వారే అనర్హులేనా? 'రుణాల' కోసమేనంటున్న సామాన్యులు



**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా తెల్ల రేషన్ కార్డు కలిగిన సామాన్య ప్రజల్లో ప్రస్తుతం ఒక కొత్త ఆందోళన మొదలైంది. ఆదాయపు పన్ను శాఖ నుంచి అందిన సమాచారం ఆధారంగా ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విచారణ జరుపుతుండటం కార్డుదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. వార్షికాదాయం రూ. 6 లక్షల కంటే ఎక్కువగా ఉండి, ఐటీ రిటర్న్స్ ఫైల్ చేసిన వారిని గుర్తించి వారి కార్డులను రద్దు చేస్తారనే ప్రచారం గ్రామాల్లో జోరుగా సాగుతోంది. స్వయంగా గ్రామ పరిపాలన అధికారులు (జీపీవోలు) లబ్ధిదారుల ఇళ్లకు వచ్చి వారు దాఖలు చేసిన ఐటీ వివరాల గురించి ప్రశ్నిస్తుండటంతో ఈ గందరగోళం మరింత ముదిరింది. ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు వెలువడకపోయినప్పటికీ, క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ ఆకస్మిక తనిఖీలు లక్షలాది మంది లబ్ధిదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.
రాష్ట్రంలో ప్రస్తుతం సుమారు 1.01 కోట్ల రేషన్ కార్డులు ఉండగా, దాదాపు 3.25 కోట్ల మంది వీటి ద్వారా లబ్ధి పొందుతున్నారు. పేదలకు రేషన్ కార్డు అనేది కేవలం బియ్యం పొందేందుకు మాత్రమే కాకుండా, ప్రభుత్వ పథకాలైన ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ వంటి కీలక ప్రయోజనాలకు పాస్‌పోర్టులా పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో కార్డు రద్దు కావడం అంటే అన్ని సంక్షేమ పథకాలకు దూరమవడమేనని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విచారణ ప్రక్రియలో భాగంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సుమారు 30,186 మందిని, సిద్దిపేట జిల్లాలో 14,200 మందిని అధికారులు లక్ష్యంగా చేసుకున్నట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా ఈ సంఖ్య కొన్ని లక్షల్లో ఉండే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అయితే, ఈ విచారణలో ఒక కీలక సాంకేతిక అంశం పట్ల లబ్ధిదారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఐటీ రిటర్న్స్ దాఖలు చేసినంత మాత్రాన వారు ధనవంతులు కాదని, పన్ను చెల్లించే స్థాయికి రిటర్న్స్ దాఖలు చేసేవారికి మధ్య చాలా వ్యత్యాసం ఉంటుందని నిపుణులు కూడా అభిప్రాయపడుతున్నారు. సామాన్య ప్రజలు, చిన్న వ్యాపారులు బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు, అలాగే యూపీఐ లావాదేవీల వల్ల కట్ అయిన టీడీఎస్ రీఫండ్ క్లెయిమ్ చేసుకోవడం కోసం తక్కువ ఆదాయం ఉన్నా ఐటీ రిటర్న్స్ సమర్పిస్తుంటారు. ప్రభుత్వం ఈ సున్నితమైన అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కేవలం రిటర్న్స్ డేటా ఆధారంగా కార్డులు రద్దు చేస్తే.. లక్షలాది మంది నిజమైన పేదలు నష్టపోయే ప్రమాదం ఉందని ప్రజా సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ప్రభుత్వం ఈ గందరగోళాన్ని వెంటనే నివృత్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.


# ఉద్యమ లక్ష్యం నెరవేరలే...

## కాంగ్రెస్, బీఆర్ఎస్ తీరుపై పార్లమెంటులో కిషన్ రెడ్డి భగ్గు

**ఢిల్లీ, మహా:** ఆంధ్రప్రదేశ్ శాశ్వత రాజధానిగా అమరావతిని ధృవీకరిస్తూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 'ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు 2026'పై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. అమరావతి అద్భుతమైన రాజధానిగా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. పార్లమెంటులో ఈ బిల్లుపై జరిగిన చర్చలో కిషన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజల పక్షాన ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ ఆయన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీకి రాజధాని లేదని అక్కడి సోదరసోదరీమణులు బాధపడే పరిస్థితి నెలకొనడం దురదృష్టకరమని, ఇవాళ కచ్చితంగా అమరావతే రాజధాని కావాలని బీజేపీ డిమాండ్ చేస్తోందని, ఈ దిశగా ఒక సానుకూల వాతావరణం ఏర్పడటం ఎంతో సంతోషదాయకమని ఆయన పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా అభివృద్ధిలో పోటీపడాలని ఆకాంక్షించారు. ఏపీలో జరుగుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలకు మోదీ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోందని, విభజన అనంతరం రాష్ట్రంలో గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని సైతం ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వెనుక ఎంతోమంది త్యాగాలు, సుదీర్ఘ పోరాట చరిత్ర ఉన్నాయని కిషన్ రెడ్డి ఈ సందర్భంగా సభ దృష్టికి తీసుకొచ్చారు. 1969లో 'జై తెలంగాణ' అని నినదించినందుకు ఏకంగా 369 మంది ఉద్యమకారులను కాంగ్రెస్ పార్టీ కాల్చి చంపిందని మండిపడ్డారు. మలిదశ ఉద్యమంలో 1200 మంది అమరులయ్యారని, నాలుగు కోట్ల మంది ప్రజలు మూకుమ్మడిగా కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి తెలంగాణ సాధించుకున్నారని స్పష్టం చేశారు. పార్లమెంటులో కాంగ్రెస్ సభ్యులు తెలంగాణలో విమానాశ్రయాలు లేవని మాట్లాడటంపై కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీలో ఎనిమిది విమానాశ్రయాలు ఉంటే, తెలంగాణలో కేవలం ఒక్కటే ఉండటానికి గత కాంగ్రెస్ పాలకుల పాపమే కారణమని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కొత్తగూడెం, వరంగల్, ఆదిలాబాద్‌లలో విమానాశ్రయాల ఏర్పాటుకు భూములు కేటాయించాలని కోరుతూ అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వానికి కేంద్రం లేఖలు రాసినా కనీస స్పందన కరువైందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ హయాంలో జాతీయ రహదారులు, రైల్వేల అభివృద్ధి శూన్యమని, ఆ వెనుకబాటుతనమే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమానికి దారితీసిందని విశ్లేషించారు. కాంగ్రెస్ పార్టీ రెండు రాష్ట్రాలను నిర్లక్ష్యం చేస్తే, మోదీ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. తెలంగాణలో ఏకకాలంలో 42 రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయని, గతంలో 2500 కిలోమీటర్లు ఉన్న జాతీయ రహదారులను ఈ పదేళ్లలో అదనంగా మరో 3 వేల కిలోమీటర్లు నిర్మించామని వివరించారు. రైల్వేలు, జాతీయ రహదారులు మొదలుకుని అన్ని రకాల పనులకు కేంద్రం అండదండగా నిలుస్తోందని స్పష్టం చేశారు.

### తెలంగాణపై బీఆర్ఎస్ నిర్లక్ష్యం

గత పదేళ్లపాటు బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని కేంద్రమంత్రి ఆరోపించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 'ఆర్ఆర్ ట్యాక్స్' పేరుతో రాష్ట్రాన్ని దోచుకుంటోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ దోపిడీపై తెలంగాణ ప్రజలు జాగృతం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏ లక్ష్యాల సాధన కోసమైతే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామో, ఆ లక్ష్యాలు నేరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజల పోరాటాన్ని, వారి త్యాగాలను నవ్వులపాలు చేసే విధంగా ప్రస్తుత కాంగ్రెస్ పాలన సాగుతోందని కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు.



# అమరావతి ఇక అజేయం.. అజరామరం


(మొదటిపేజీ తరువాయి)

ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని సీఎం అన్నారు. లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. గత పాలనలో ఎదురైన చీకట్లు తొలగిపోయి, అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని సీఎం పేర్కొన్నారు. రైతుల త్యాగానికి, ప్రజల ఆకాంక్షలకు దక్కిన గౌరవం ఇదన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఓ కీలక మైలురాయన్నారు. అమరావతి ఇక అజేయం.. అజరామరం అని సీఎం అన్నారు. రాజధానిని విశ్వనగరంగా తీర్చిదిద్ది ప్రపంచ పటంలో నిలుపుతామని స్పష్టం చేశారు. సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి, హోం మంత్రి అమిత్ షాకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. లోక్‌సభలో బిల్లుకు మద్దతు పలికిన అన్ని పార్టీలకు ఆంధ్రప్రదేశ్ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

### రాజ్యసభకు బిల్లు

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిగా చట్టబద్ధత కల్పించిన బిల్లుకు బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందింది. అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు చేరింది. ఈ బిల్లు తమ వద్దకు వచ్చిందని రాజ్యసభ సెక్రటరీ జనరల్ న్యూఢిల్లీలో వెల్లడించారు. ఈ బిల్లు ఆమోదం కోసం గురువారం రాజ్యసభలో పెడతామని స్పష్టం చేశారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లును గురువారం రాజ్యసభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ప్రవేశపెట్టనున్నారు. అనంతరం మధ్యాహ్నం 1.00 గంటకు ఈ బిల్లుపై సభలో చర్చ జరగనుంది. రాజ్యసభలో సైతం ఈ బిల్లు ఆమోదం పొందితే.. అనంతరం రాష్ట్రపతి వద్దకు ఈ బిల్లును పంపుతారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సైతం ఈ బిల్లును ఆమోదిస్తూ సంతకం చేస్తే.. రాజధాని అమరావతి చట్టంగా మారుతుంది.

# మచిలీపట్నం టు గుంటూరు క్యాపిటల్



(మొదటిపేజీ తరువాయి)

వరకూ రాజధాని ఏరియాగా ప్రకటించాలని జగన్ డిమాండ్ చేశారు. ఆ ప్రాంతానికి మావిగన్ అని పేరు పెట్టాలని కోరారు. మచిలీపట్నం నుంచి విజయవాడకు 70 కిలోమీటర్లు, విజయవాడ నుంచి గుంటూరుకు 40 కిలోమీటర్లు ఉందని, మొత్తం 110 కిలోమీటర్ల నేషనల్ హైవే ఉన్న ప్రాంతాన్ని మావిగన్ పేరుతో రాజధాని చేయాలని, మావిగన్ అంటే జగన్ గుర్తువస్తాడనుకుంటే వేరే పేరు పెట్టాలని సూచించారు. వైసీపీ అమరావతికే కాదు.. రాష్ట్రంలో ఏ ప్రాంతానికీ ఎప్పుడూ వ్యతిరేకం కాదన్నారు. కానీ.. చంద్రబాబు నాయుడు 12 ఏళ్ల కాలంలో మనస్ఫూర్తిగా ఇక్కడ ఉన్నారా ? అని ప్రశ్నించారు. చంద్రబాబు, పవన్, లోకేష్‌ల ఫ్యామిలీలు మూడు ప్రత్యేక విమానాల్లో షటిల్ సర్వీస్ చేస్తున్నారని విమర్శించారు.

# పారిశుధ్య పనులు, నీటి సరఫరా పకడ్బందీగా చేయాలి

- జిల్లా కలెక్టర్ గారిమ అగర్వాల్
- వేములవాడ మున్సిపల్ కౌన్సిల్ మెరుగైన సేవలు అందించాలి
- పన్నులు 100 శాతం వసూలు చేయించాలి

**వేములవాడ, మహా:** వేములవాడ మున్సిపల్ పరిధిలో నిత్యం పారిశుధ్య పనులు, నీటి సరఫరా పనులు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వేములవాడ మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో బుధవారం నిర్వహించగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మాట్లాడారు. అందరి సహకారంతో ఇటీవల మున్సిపల్ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేశామని, నూతన సభ్యులకు అభినందనలు తెలియజేసారు. వేములవాడ మున్సిపల్ కౌన్సిల్ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు.
బడ్జెట్ మీటింగ్ చాలా కీలకమని, రెవెన్యూ వ్యయంలో భాగంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, కరెంట్ బిల్లులు, రుణాల చెల్లింపు, పారిశుధ్య పనులకు చెల్లింపులు, ఇతర ఖర్చులు ఉంటాయని, తప్పనిసరిగా 10 శాతం గ్రీన్ బడ్జెట్ ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. నర్సరీల నిర్వహణ, మొక్కల పెంపకం, సంరక్షణకు ఖర్చు చేయాలని సూచించారు. మున్సిపల్ మొత్తం బడ్జెట్ లో 1/3 శాతం విలీన గ్రామాలు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి వినియోగించాలని తెలిపారు. మున్సిపల్ కార్మికులందరికీ వెంటనే బీమా చేయించాలని కమిషనర్ ను ఆదేశించారు. మున్సిపల్ కు రావాల్సిన పన్నులు 100 శాతం వసూలు చేయడంతో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ముందుకు వెళ్తే 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు అవుతాయని వెల్లడించారు. మున్సిపల్ వార్డ్ సభ్యులు తమ పరిధిలో ఇంటి, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేసేందుకు సహకరించాలని, అన్ని షాప్ లు లైసెన్స్ తీసుకునేలా చూడాలని సూచించారు. మున్సిపల్ నిధులతో నిర్మించిన భవనాలు అన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతి రోజు పారిశుధ్య పనులు పక్కాగా చేయించాలని, తడి, పొడి చెత్త వేరువేరుగా ఇచ్చేలా అవగాహన కల్పించాలని సూచించారు. తడి చెత్తను ఎరువుగా చేసి విక్రయించాలని, పొడి చెత్తను విక్రయిస్తే బల్దియాకు ఆదాయం వస్తుందని తెలిపారు. పార్క్ లు, వైకుంఠధామాలు, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. వేములవాడ గుడి చెరువు బండ్ పార్క్ ప్రారంభానికి సిద్ధం అవుతుందని, నిర్వహణ పక్కాగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. డీఆర్ సీసీ కేంద్రం పక్కాగా నిర్వహించాలని సూచించారు. నాంపల్లి గుట్టపై ఎయిర్ ఫోర్స్ యుద్ధ విమానం ఏర్పాటు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తాగునీటి సమస్య రాకుండా వార్డు సభ్యులు, అధికారులు చూసుకోవాలని తెలిపారు. ఏమైనా మరమ్మత్తు ఉంటే చేయించాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.
**బడ్జెట్ సారాంశం:** మున్సిపల్ స్వంత నిధుల నుండి అంచనా ఆదాయం రూ. 17.68 కోట్లు గ్రాంట్ల నుండి వచ్చే అంచనా ఆదాయం రూ. 9.00 కోట్లు మొత్తం అంచనా ఆదాయం రూ. 26.68 కోట్లు అంచనా వ్యయం గ్రాంట్లతో సహా రూ. 26.05 కోట్లు మిగులు అంచనా విలువ రూ. 0.60 కోట్లు సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, తహసీల్దార్ జయంత్ కుమార్, కౌన్సిలర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎట్టకేలకు క్యాతనపల్లి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు

- పరోక్ష ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేయాలి
- క్యాతనపల్లి మున్సిపాలిటీని సందర్శించిన జిల్లా అదనపు కలెక్టర్



**మందమర్రి, మహా :** ఎట్టకేలకు క్యాతనపల్లి మున్సిపాలిటీకి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, బెల్లంపల్లి ఏసీపీ, కిరణ్ కుమార్, మందమర్రి సిఐ పర్స రమేష్, తాసిల్దార్ సతీష్ కుమార్, స్థానిక కమిషనర్ జి వెంకట నర్సయ్యలు మున్సిపల్ కార్యాలయం లోపల ఉపరితల ప్రాంతాలలో చేపట్టవలసిన జాగ్రత్తల గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం క్యాతనపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పరోక్ష ఎన్నికలను పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలనిఅధికారులకు సూచించారు. 4 ఏప్రిల్ 2026 న నిర్వహించనున్న క్యాతనపల్లి మున్సిపాలిటీ పరోక్ష ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అంతరాయాలు కలగకుండా పర్యవేక్షించాలని ఆయన అన్నారు. ఒకవైపు ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ మరోవైపు ఎన్నికల నోటీసులను ఎన్నికైన కౌన్సిలర్లకు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కౌన్సిలర్లకు కూర్చునే ఏర్పాట్లు, సమావేశ మందిరంలో సక్రమంగా అమరికలు, భద్రతా ఏర్పాట్లు, ప్రవేశ-నిష్క్రమణ మార్గాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో వేదిక, మైక్ వ్యవస్థ, రికార్డు నిర్వహణ వంటి అంశాలను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన మార్గదర్శకాలు జారీ చేశారు. అసిస్టెంట్ ఇంజనీర్‌కు ప్రత్యేకంగా సూచనలు ఇస్తూ, ఎన్నికల వేదిక పరిసర ప్రాంతాలలో బారికేడింగ్‌ను సక్రమంగా ఏర్పాటు చేసి అనవసర గుంపులు చేరకుండా చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలాలు కేటాయించి రాకపోకలు సులభంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. సమావేశ ప్రాంగణంలో తాగునీరు, విద్యుత్, శానిటేషన్ వంటి మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేసి, ఎలాంటి లోపాలు తలెత్తకుండా పర్యవేక్షించాలని తెలిపారు.

## శాంతి భద్రతలకు లోటు రానివ్వద్దు

మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో కార్యాలయం లోపల, ఉపరితల ప్రాంతాలలో శాంతి భద్రతలకు ఎలాంటి లోటు రానివ్వద్దని మంచిర్యాల అదనపు కలెక్టర్ చంద్రయ్య పోలీసులకు సూచించారు. ఇంతకు క్రితం ఇక్కడ జరిగిన దాడులు ప్రతి దాడులు వివాదాలను దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యలలో భాగంగా చట్టాన్ని, హక్కులను పోలీసులు పరిరక్షించాలని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తు భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక అసిస్టెంట్ ఇంజనీర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాలన శాస్త్ర విద్యార్థుల క్షేత్ర పర్యటన

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలోబెల్లంపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణ తీరుపై పరిశీలన**

**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రభుత్వ పాలనశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో బుధవారం క్షేత్ర పర్యటన నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ పాలనశాస్త్ర విభాగం సీనియర్ అధ్యాపకులు గజెల్లి మోహన్ ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులు బెల్లంపల్లి మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లారు. ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తున్న తీరుపై క్షుణ్ణంగా పరిశీలించారు...వివిధ విభాగాల పరిశీలన..బెల్లంపల్లి మున్సిపాలిటీ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిల్డ్రన్స్ పార్క్, కన్నాల బస్తీలోని పార్క్,మొక్కల నిర్వహణ కేంద్రం,మంచినీటి సరఫరా ట్యాంకు,కూరగాయల మార్కెట్,రోడ్ల అభివృద్ధి కార్యక్రమాలు, డంపింగ్ యార్డ్, చెత్త నిర్వహణ తదితర అన్ని స్థలాలను పరిశీలించారు. మున్సిపాలిటీ పరిపాలన విభాగంలోని వివిధ డిపార్ట్మెంట్లను కూడా వీక్షించడం జరిగింది. అనంతరం మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి ని కలిసి వివిధ అంశాలపై అవగాహన పొందారు. మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ,ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ప్రజల భాగస్వామ్యం సరిగా లేకపోవడం వల్ల పూర్తిస్థాయి సత్ఫలితాలు కలగడం లేదని చెప్పారు.ఈ కార్యక్రమం లో ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగం సీనియర్ అధ్యాపకులు గజెల్లి మోహన్, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యారంగ అభివృద్ధి, మహిళల సంక్షేమంపై

# ప్రభుత్వ ప్రత్యేక చర్యలు

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**బెల్లంపల్లి,మహా:** ప్రభుత్వం విద్య,వైద్య రంగాల అభివృద్ధి,మహిళల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాల అభివృద్ధి పనులు, తరగతి గదులు, మూత్రశాలలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్య బోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. తరగతి గదిలో విద్యార్థులను పాఠ్యాంశాలకు సంబంధించిన ప్రశ్నలు అడిగి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు.మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహసిల్దార్ తో కలిసి రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని,ప్రక్రియ వేగవంతం చేసేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. వివిధ ధ్రువపత్రాల కొరకు అందిన దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు,సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని తెలిపారు.కార్యాలయ హాజరు పట్టిక పరిశీలించి సమయపాలన పాటించని 11 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు... ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలన..ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సందర్శించి ప్రజలకు అందిస్తున్న సౌకర్యాలు, ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, రిజిస్టర్లను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసర మైన మందుల నిల్వలు అందుబాటు లో ఉంచుకోవాలని,పారిశుధ్యనిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటిస్తూ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని తెలిపారు.... వైద్య శిబిరం సందర్శన.. బెల్లంపల్లి మండలంలోని బట్వాన్పల్లి గ్రామపంచాయతీ కార్యాలయఆవరణలోఏర్పాటుచేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్యాధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 15 రోజుల కార్యచరణలో భాగంగా వైద్య శిబిరం నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు.శిబిరానికి వచ్చే ప్రజలకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందించాలని, అవసరమైన మందులను ఉచితంగా అందించాలని తెలిపారు.ఈ కార్యక్రమాలలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకొని

# కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

- ఒక రోజే 10,909 టన్నుల బొగ్గు రవాణా చారిత్రాత్మకం
- మందమర్రి ఏరియా జిఎం ఎన్ రాధాకృష్ణ వెల్లడి



**మందమర్రి, మహా :** వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకొని కే.కే.ఓ.సీపీ కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నామని మందమర్రి జిఎం ఎన్ రాధాకృష్ణ వెల్లడించారు. బుధవారం ఏరియాలోని కే.కే.ఓ.సీపీ కార్మికులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ కార్యక్రమాన్ని ఆగని ప్రాజెక్టు ఆఫీసర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిఎం ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ పెరుగుతున్న వేసవి తాపం దృష్ట్యా కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కేకేఓసీపీ ప్రాజెక్టులో మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమాన్నిచేపట్టినట్లు చెప్పారు.

**ఒక్కరోజే 10,909 టన్నుల బొగ్గు రవాణా**

మందమర్రి ఏరియాలో ఒక్కరోజే 10,909 టన్నుల బొగ్గు రవాణా కేకేఓసీపీ కార్మికులు సాధించిన చారిత్రాత్మక రికార్డ్ అని స్థానిక జీఎం రాధాకృష్ణ వెల్లడించారు. అంతేకాకుండా రికార్డు స్థాయి డిస్పాచ్ లో గత 31 మార్చి 2026 నాడు కేకేఓసీపీ ఏకంగా 10,909.44 టన్నుల బొగ్గును రవాణా చేసి సరికొత్త రికార్డు సృష్టించింద కార్మికులను సూపర్వైజర్లను అధికారులను ఆయన అభినందించారు. అలాగే మార్చి 2026లో సాధించిన 2,30,464 టన్నుల అత్యధిక నెలవారీ డిస్పాచ్ మరో ముఖ్యమైన మైలురాయిగా ఆయన అభివర్ణించారు. ఈ ప్రాజెక్ట్ ప్రారంభమైనప్పటి నుండి ఇదే అత్యధిక ఒక్కరోజు డిస్పాచ్‌గా నమోదు కావడం విశేషమని ఆయన హర్షం వ్యక్తం చేశారు. మందమర్రి ఏరియా మొత్తం ఉత్పత్తి పురోగతిలో కేకేఓసీపీ కీలక పాత్ర పోషిస్తోందని, ఇక్కడి పనితీరు సంస్థ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం మల్లయ్య,ఇంజనీర్ ఎన్. వెంకటవంశీధర్, ఏరియా సీఎంఓఏఐ అధ్యక్షులు ఎస్ రమేష్, ఏఐటియుసి అసిస్టెంట్ బిట్ కార్యదర్శి రాజేష్ కుమార్ యాదవ్ తదితరులు ఉన్నారు.



## మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం

# చేయూతనందిస్తుంది

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**బెల్లంపల్లి, మహా:** రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమంతో పాటు ఆర్థిక అభివృద్ధికి చేయూత అందిస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి మండలం పెర్కపల్లి గ్రామ రైతు వేదిక లో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ల శిక్షణ కార్యక్రమానికి జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, అలీప్ సంస్థ ప్రతినిధులతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమంతోపాటు వారి ఆర్థిక అభివృద్ధికి చేయూతనందిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో రాంప్ ప్రాజెక్టు క్రింద స్వయం సహాయక సంఘాలు, స్టార్టప్ లను ఎం ఎస్ ఎం ఈ లుగా మార్చి అభివృద్ధి పథంలో నడిపించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మహిళల సంక్షేమ కార్యక్రమాలలో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా ఉచితబస్సు ప్రయాణం కల్పించి మహిళలకు లబ్ధి చేకూర్చడం జరుగుతుందని తెలిపారు.ఇందిరా మహిళాశక్తిపథకం ద్వారా మహిళలు వివిధ వ్యాపారాలు చేసేందుకుగాను రుణ సదుపాయం కల్పించి ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ అందించి స్వయం ఉపాధి పొందేలా తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెంది కుటుంబ పోషణకు కృషి చేయాలని తెలిపారు. ఎంచుకున్న రంగంలో రాణించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని తెలిపారు.అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల అభివృద్ధి కొరకు చేపడుతున్న కార్యక్రమాలలో భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు విద్యార్థుల దుస్తుల తయారీకి అందించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సకాలంలో అందించారని తెలిపారు. ఎం ఎస్ ఎం ఈ కార్యక్రమంలో భాగంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహకంలో భాగంగా రాంప్ పథకంలో ఎం ఎస్ ఎం ఈ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, అలీప్ సంయుక్తంగా రాష్ట్రంలోని మహిళల ఆర్థిక స్వావలంబన కృషి చేస్తున్నాయని తెలిపారు.

## బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో

# బిఏ ఆనర్స్ కోర్సు

### డిగ్రీలో ఒకే సబ్జెక్టును స్పెషలైజేషన్ గా మూడేళ్ల పాటు చదివే అద్భుత అవకాశం

### ఇన్కమ్ సర్టిఫికెట్ ఉన్నవారికి ఉచితంగా అడ్మిషన్

### రానున్న 202627 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం

### తెలంగాణ మల్టీ జోన్1లో ఈ కోర్సు గల ఏకైక కళాశాల




**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రానున్న 202627 విద్యా సంవత్సరం నుంచి బిఏ ఆనర్స్ అనే అద్భుతమైన డిగ్రీకోసం అందుబాటులోకి రానుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు.ఉన్నత విద్యా వ్యవస్థలో వినూత్నమైనమార్పులు తీసుకువస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం... పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులకు జీవనోపాధి పెంచే విధంగా కొత్త కోర్సులను అందుబాటులోకి తీసుకువస్తోందని వివరించారు. అందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్నత విద్యాసంస్థల్లో కొత్త కొత్త కోర్సులు ప్రవేశపెడుతోంది.ఈ మేరకు బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బిఏ ఆనర్స్ అనే ప్రతిష్టాత్మక కోర్సును కేటాయించింది. ఢిల్లీ యూనివర్సిటీ & సెంట్రల్ యూనివర్సిటీలలో మాత్రమే అందుబాటులో ఉన్న బిఏ ఆనర్స్ అనే కోర్సు ఇప్పుడు బెల్లంపల్లి పట్టణంలో అందుబాటులోకి వస్తుంది....ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులు వీరే..బిఏ ఆనర్స్ కోర్సులో చేరడానికి ఇంటర్మీడియట్ తత్సమాన కోర్సులతోపాటు పాలిటెక్నిక్ డిప్లమా చేసిన వారు కూడా అర్హులే. ఇంటర్మీడియట్లో హెచ్ఈసి, సిఇసి, బైపిసి, ఎంపీసీ, కోర్సులతోపాటు ఒకేషనల్ చదివిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అన్ని కోర్సుల విద్యార్థులు కూడా చదవగలిగే సబ్జెక్టును ఈ డిగ్రీలో ఎంచుకోవచ్చు.

## మల్టీ జోన్-1లో ఏకైక కళాశాల..

బిఏ ఆనర్స్ అనే కోర్సు సగం తెలంగాణకు చెందిన మల్టీ జోన్1లో ఏ ఒక్క డిగ్రీ కళాశాలలో కూడా లేదు. కానీ ఇప్పుడు ఆ అరుదైన ఘనత బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల దక్కించుకుంది. రానున్న 202627 విద్యా సంవత్సరం నుంచి ఈ కళాశాలలో బిఏ ఆనర్స్ అనే కోర్సు దోస్త్ అడ్మిషన్ల ద్వారా ప్రారంభం కానుంది. ఒకే సబ్జెక్టును స్పెషలైజేషన్ గా తీసుకొని మూడేళ్ల పాటు చదవడం ద్వారా ఆ సబ్జెక్టులో అత్యున్నతమైనటువంటి పట్టు సాధించే అవకాశం ఈ కోర్సు ద్వారా ఉంటుంది...అంచెలంచెలుగా ఎదుగుతున్న బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల...బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల గురించి చెప్పాలంటే 2018 కి ముందుఆ తర్వాత అని చెప్పాలి. 2018కి ముందు కేవలం ఆర్ట్స్, కామర్స్ కోర్సులలో వందకు అటు ఇటుగా మాత్రమే విద్యార్థుల సంఖ్య ఉండేది. కానీ 2019 నుంచి సైన్స్ కోర్సులు కూడా ప్రారంభమయ్యాయి. ఫిజికల్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్ ,హార్టికల్చర్, ఫిషరీస్, బాటని ,జువాలజీ, కెమిస్ట్రీ ,కంప్యూటర్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. బీఏ, బీకాం, బీఎస్సీ అన్నికోర్సులలో క్రమంగా విద్యనభ్యసించే విద్యార్థుల సంఖ్య పెరుగుతూ వస్తూ ఒక దశలో 840 కి పైగా అయ్యింది. బీకాం టాక్సేషన్, బీకాం బి ఎఫ్ ఎస్ ఐ , బీకాం ఈ కామర్స్ ఆపరేషన్స్ , బీకాం కంప్యూటర్స్ వంటి కొత్త కోర్సులు వచ్చాయి. ఇప్పుడు బిఏ ఆనర్స్ రాకతో కళాశాల అభివృద్ధి మరింత ఉన్నత స్థితికి చేరనుంది....

## బిఏ ఆనర్స్ తో ఉజ్వల భవిష్యత్తు:

బిఏ ఆనర్స్ కోర్స్ ద్వారా విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లిశంకర్ తెలిపారు.ఆదాయ ధ్రువీకరణ పత్రసమర్పణతో దరఖాస్తు చేసుకుంటే ఫీజు ఉండదని ఉచితంగా చదువుకోవచ్చు అని సూచించారు. యుపిఎస్సి, టిఎస్పిఎస్సి వంటి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఇటువంటి కోర్సులు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. డిగ్రీ అడ్మిషన్ల కోసం దోస్త్ నోటిఫికేషన్ రాగానే ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# సారపాకలో పబ్లిక్ టాయిలెట్ నిర్వహణలో నిర్లక్ష్యం

**సంరక్షకుడికి నీడ లేక ఇబ్బందులు**




**బూర్గంపహాడ్ మహా :**సారపాక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్ పనులు దాదాపు పూర్తయ్యాయి. ప్రజలకు అవసరమైన సదుపాయాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్మాణాన్ని చేపట్టినప్పటికీ, నిర్వహణలో కొన్ని లోపాలు బయట పడుతున్నాయి.పబ్లిక్ టాయిలెట్ సంరక్షణ బాధ్యతలు చేపట్టిన వ్యక్తికి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. టాయిలెట్ ముందు నీడ లేకపోవడంతో ఆ వ్యక్తి ప్రతిరోజూ ఎండలోనే విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. ముఖ్యంగా ఈ ఎండాకాలంలో తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉన్నదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గ్రామస్థుల అభిప్రాయం ప్రకారం, ఐటీసీ యాజమాన్యం మరియు గ్రామపంచాయతీ పాలకవర్గం కాస్త దృష్టి సారిస్తే టాయిలెట్ ముందు రేకులు వేయడం, ఒక ఫ్యాన్ ఏర్పాటు చేయడం వంటి చిన్న చర్యలతో పెద్ద మార్పు తీసుకురాగలరు. ముఖ్యంగా వయసు మళ్లిన వ్యక్తులను సంరక్షణ పనుల్లో నియమిస్తున్న సందర్భంలో, వారి ఆరోగ్యం మరియు భద్రతపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని చెబుతున్నారు.ఎండాకాలం మాత్రమే కాకుండా వర్షాకాలంలో కూడా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున, పబ్లిక్ టాయిలెట్ సంరక్షకులకు ఎండ, వర్షం నుండి రక్షణ కల్పించే విధంగా తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తారా అనేది చూడాలి.



# మొరంపల్లి బంజర వారపు సంత వేలం పూర్తి

**₹35.61 లక్షలకు హక్కులు కైవసం చేసుకున్న భూక్యా రంజిత్**

**బూర్గంపహాడ్ మహా :** మొరంపల్లి బంజర గ్రామంలో ప్రతి సంవత్సరం నిర్వహించే వారపు సంతకు సంబంధించిన వేలం ప్రక్రియ ఈసారి విజయవంతంగా పూర్తయింది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేలంలో స్థానిక వ్యాపారులు, ఆసక్తి గల వ్యక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీ ఎక్కువగా ఉండటంతో వేలం ప్రక్రియ ఉత్కంఠభరితంగా సాగింది.ఈ వేలంలో భూక్యా రంజిత్ అత్యధికంగా ₹35,61,000 మొత్తాన్ని కోట్ చేసి సంత హక్కులను కైవసం చేసుకున్నారు. ఇతర పోటీదారుల కంటే ఎక్కువ ధర చెప్పడంతో ఆయనకు ఈ ఏడాది వారపు సంత నిర్వహణ బాధ్యతలు దక్కాయి. ఈ మొత్తం గ్రామ పంచాయతీకి మంచి ఆదాయాన్ని తీసుకురానుంది.గ్రామ పంచాయతీ అధికారులు వేలం ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించినట్లు తెలిపారు. అన్ని నిబంధనలు పాటిస్తూ, అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ ఈ వేలం నిర్వహించామని పేర్కొన్నారు. దీంతో గ్రామస్థులలో కూడా నమ్మకం పెరిగింది.ఈ వేలం ద్వారా భూక్యా రంజిత్ వచ్చే ఏడాది పాటు మొరంపల్లి బంజర వారపు సంత నిర్వహణను చేపట్టనున్నారు. సంత నిర్వహణలో శుభ్రత, సదుపాయాలు, వ్యాపారులకు అనుకూల వాతావరణం కల్పించాలని గ్రామ ప్రజలు ఆశిస్తున్నారు.గ్రామ ఆర్థిక వ్యవస్థలో వారపు సంత ముఖ్య పాత్ర పోషిస్తుండటంతో, ఈ వేలం విజయవంతం కావడం పట్ల గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేసారు

## 4 లేబర్ కోడ్‌ల అమలుకు వ్యతిరేకంగా..

# మణుగూరులో కార్మికుల నిరసన..

**మణుగూరు, మహా :** కార్మిక వర్గాన్ని కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్‌ల అమలు నిర్ణయాన్ని తెలంగాణ రాష్ట్రంలో నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మణుగూరు ఏరియాలో కార్మికులు బుధవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. రాష్ట్ర కార్మిక సంఘాల కమిటీల పిలుపు మేరకు మణుగూరు ఏరియా అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఓసి2, కొండాపురం సి.ఎస్.పి, కొండాపురం భూగర్భ గని, పి.వి కాలనీ పారిశుధ్య విభాగం, సింగరేణి రైల్వే విభాగం సహా అన్ని గనులు, విభాగాల్లో పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేసిఎస్ పి డీజీఎం, ఈఅండ్ఎం వి మదన్ నాయక్‌కు జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కార్మికుల పోరాట ఫలితంగా సాధించిన 29 కార్మిక చట్టాలను కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడం అన్యాయమని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏప్రిల్ 1 నుండి అమలు చేయాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ చట్టాలను అమలు చేయాలా వద్దా అనే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి అధికారాలు ఉన్నందున తెలంగాణలో వాటిని అమలు చేయవద్దని, సింగరేణి యాజమాన్యం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతికూల సిఫారసు చేయాలని కోరారు. కార్మికుల భావోద్వేగాలను పట్టించుకోకపోతే అన్ని సంఘాలు కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఐఎఫ్‌టీయూ సమన్వయంతో కార్యక్రమం నిర్వహించగా .. ఐఎఫ్‌టీయూ నాయకులు అంగోత్ మంగీలాల్, ఏఐటీయూసీ నేత శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

# బూర్గంపహాడ్ గ్రామ అభివృద్ధి వేగం

**ఎమ్మెల్యే పాయం ప్రత్యేక చొరవ**

**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపహాడ్ గ్రామపంచాయతీ అభివృద్ధి దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవతో గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పలు పనులకు అనుమతులు తీసుకువచ్చి, వాటి అమలుపై దృష్టి సారిస్తున్నారు.ఈ క్రమంలో సుమారు రూ.50 లక్షల వ్యయంతో పలు సీసీ రోడ్లు మరియు డ్రైనేజీ నిర్మాణాలకు మంజూరు లభించింది. గ్రామంలో ప్రధాన వీధులు, కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడం వల్ల రవాణా సౌలభ్యం మెరుగుపడటంతో పాటు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది. వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తగ్గి, పరిశుభ్రత కూడా పెరగనుంది.ఈ అభివృద్ధి పనులకు నేడు గ్రామంలో శంకుస్థాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మందా నాగరాజు, ఉపసర్పంచ్ గుండె వెంకన్న నేతృత్వం వహించి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై అభివృద్ధి పనుల ప్రారంభాన్ని స్వాగతించారు.కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ ప్రభాకర్, ఏఈ చారి, అలాగే స్థానిక నాయకులు భజన సతీష్ కుమార్, చిప్పా రాజు, గుద్దేటి ప్రవీణ్, భజన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, యువత కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలో ఇలాంటి అభివృద్ధి పనులు మంజూరు చేయడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గారికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సంపాదకీయం | EDITORIAL | గురువారం, హైదరాబాద్ | 02-04-2026
ANN తెలుగు

ఏ రాజధాని కోసం అయితే వేలాది మంది రైతులు సుదీర్ఘ పోరాటం చేశారో, అకుంఠిత దీక్షతో ఎన్నో అవమానాలను భరించారో.. ఆ మహా త్యాగానికి పార్లమెంటు వేదికగా శాశ్వత రక్షణ కవచం దక్కుతుండడం అద్భుతం. చారిత్రాత్మకం. అమరావతి చరిత్రలో మరొక సువర్ణాధ్యాయం మొదలైంది. ఒకప్పుడు కన్నీళ్లు, నెత్తురు చిందించిన ఆ నేల పై, ఇప్పుడు ఆత్మగౌరవపు పూలు వికసిస్తున్నాయి.

ఒక నగరాన్ని నిర్మించడం సామాన్యమైన విషయం కాదు, దానికి వేలాది ఎకరాల భూమి అవసరం. భూసేకరణ చట్టాలను ప్రయోగించి బలవంతంగా భూములు లాక్కోకుండా, కేవలం ఒక నాయకుడిపై ఉన్న నమ్మకంతో 60 రోజుల్లో 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ప్రభుత్వానికి ఇవ్వడం బహుశా ప్రపంచ చరిత్రలోనే ఇదే తొలిసారి.

నిరంతర శ్రమతో పచ్చని పొలాలను పండించే అన్నదాతలు, తమ తరతరాల జీవనాధారమైన వ్యవసాయాన్ని, ఆ మట్టితో ఉన్న పేగుబంధాన్ని రాష్ట్ర భవిష్యత్తు కోసం వదులుకున్నారు. కృష్ణా నది ఒడ్డున, రాష్ట్రానికి నడిబొడ్డున ఉన్న ఈ ప్రాంతం, 3000 ఏళ్ల శాతవాహనుల నాగరికతకు, బౌద్ధ విజ్ఞానానికి ప్రతీక. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికత పై రైతులు ఉంచిన ప్రగాఢ విశ్వాసమే ఈ అమరావతి నిర్మాణానికి అసలైన పునాది.

లోక్‌సభలో జరిగిన చర్చ పలు రాజకీయ పక్షాల నైతిక మద్దతునిచ్చింది. సమాజవాదీ పార్టీ, శివసేన, ఎన్సీపీ, బీజేపీతో సహా దేశంలోని అన్ని ప్రధాన పార్టీలు అమరావతికి ఏకగ్రీవంగా మద్దతు పలికాయి. రైతుల త్యాగాలను కొనియాడాయి. కానీ, ఆశ్చర్యకరంగా వైఎస్సార్సీపీ మాత్రమే ఈ బిల్లును వ్యతిరేకించి సభ నుండి వాకౌట్ చేయడం గమనార్హం.

# అమరావతికి ఆమోదం.. అపూర్వఘట్టం

ఆంధ్రుల కలల రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు దిగువ సభ అయిన లోక్‌సభలో బిల్లు విజయవంతంగా ఆమోదం పొందడం రాష్ట్ర చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం. ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షల మేరకు లోక్‌సభలో లాంఛనంగా నెగ్గిన ఈ బిల్లు, గురువారం రాజ్యసభలో కూడా ప్రవేశపెట్టబడి ఆమోదముద్ర వేయించుకోనుంది. ఏ రాజధాని కోసం అయితే వేలాది మంది రైతులు సుదీర్ఘ పోరాటం చేశారో, అకుంఠిత దీక్షతో ఎన్నో అవమానాలను భరించారో.. ఆ మహా త్యాగానికి పార్లమెంటు వేదికగా శాశ్వత రక్షణ కవచం దక్కనుంది. ఈ ఉద్విగ్నభరితమైన,చారిత్రక సందర్భంలో అమరావతి గతాన్ని, వర్తమానాన్ని, భవిష్యత్తును విశ్లేషిద్దాం. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి చరిత్రలో మరొక సువర్ణాధ్యాయం మొదలైంది. ఒకప్పుడు కన్నీళ్లు, నెత్తురు చిందించిన ఆ నేల పై, ఇప్పుడు ఆత్మగౌరవపు పూలు వికసిస్తున్నాయి. దేశ సర్వోన్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటు సాక్షిగా, అమరావతే ఆంధ్రప్రదేశ్ కు ఏకైక రాజధాని అని ప్రస్తావిస్తూ చట్టబద్ధత లభించడం కేవలం ఒక భౌగోళిక ప్రాంతానికి దక్కిన గుర్తింపు కాదు; అది 29 వేల మంది రైతుల అకుంఠిత దీక్షకు, త్యాగానికి దక్కిన చారిత్రక సత్కారం. గుంటూరు పార్లమెంటు సభ్యులు, కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలుగులో ఉద్వేగభరితంగా చేసిన ప్రసంగం యావత్ రాష్ట్ర ప్రజానీకంలో, ముఖ్యంగా రాజధాని పల్లెల్లో ఒక కొత్త ఉత్సాహాన్ని నింపింది.

### రైతుల స్వచ్ఛంద భాగస్వామ్యం ఒక అపూర్వ ఘట్టం

ఒక నగరాన్ని నిర్మించడం సామాన్యమైన విషయం కాదు, దానికి వేలాది ఎకరాల భూమి అవసరం. భూసేకరణ చట్టాలను ప్రయోగించి బలవంతంగా భూములు లాక్కోకుండా, కేవలం ఒక నాయకుడిపై ఉన్న నమ్మకంతో 60 రోజుల్లో 29 వేల మంది రైతులు 34 వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ప్రభుత్వానికి ఇవ్వడం బహుశా ప్రపంచ చరిత్రలోనే ఇదే తొలిసారి. నిరంతర శ్రమతో పచ్చని పొలాలను పండించే అన్నదాతలు, తమ తరతరాల జీవనాధారమైన వ్యవసాయాన్ని, ఆ మట్టితో ఉన్న పేగుబంధాన్ని రాష్ట్ర భవిష్యత్తు కోసం వదులుకున్నారు. కృష్ణా నది ఒడ్డున, రాష్ట్రానికి నడిబొడ్డున ఉన్న ఈ ప్రాంతం, 3000 ఏళ్ల శాతవాహనుల నాగరికతకు, బౌద్ధ విజ్ఞానానికి ప్రతీక. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికత పై రైతులు ఉంచిన ప్రగాఢ విశ్వాసమే ఈ అమరావతి నిర్మాణానికి అసలైన పునాది.

### 1631 రోజుల వ్యధా భరిత పోరాటం

2019లో అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం, అధికార వికేంద్రీకరణ, "మూడు రాజధానుల" పేరుతో అమరావతిని విధ్వంసం చేసే ప్రయత్నం చేసింది. రాజధాని కోసం సర్వస్వం త్యాగం చేసిన రైతులను తీవ్రమైన మానసిక, భౌతిక క్షోభకు గురి చేసింది. తమ హక్కుల కోసం శాంతియుతంగా రోడ్డెక్కిన రైతులను, మహిళలను "పెయిడ్ ఆర్టిస్టులు" అని అవమానించడం అత్యంత బాధాకరం. తమ సొంత గ్రామాల్లో తిరగడానికే గుర్తింపు కార్డులు అడగడం, 144 సెక్షన్ తో వారి స్వేచ్ఛను హరించడం లాంటి నిరంకుశ చర్యలను రాష్ట్రం చూసింది. న్యాయస్థానం నుండి దేవస్థానం వరకు వారు చేసిన 45 రోజుల మహా పాదయాత్రలో ఎదుర్కొన్న హింస వర్ణనాతీతం. మేకులు కొట్టిన లాఠీలతో దాడులు చేయడం, అన్నం తినే కంచాల్లో ఇసుక పోయడం లాంటి అమానుషాలకు అప్పటి ప్రభుత్వం పాల్పడింది. అయినా సరే, ఆ రైతులు వెనకడుగు వేయలేదు. 1631 రోజుల పాటు సాగిన వారి అలుపెరగని పోరాటం, ఈరోజు పార్లమెంటులో చట్టరూపం దాల్చడానికి బలమైన పునాదిగా మారింది. ఆనాడు ఆ తల్లులు కార్చిన కన్నీళ్లే ఈనాడు అమరావతి భవనాలకు పునాదిరాళ్లుగా మారాయి.

### చట్టబద్ధత ఎందుకు అంత కీలకం ?

ఈరోజు లోక్‌సభలో అమరావతికి దక్కిన ఈ చట్టబద్ధత ఒక చారిత్రక, ఆర్థిక అవసరం. ఈ బిల్లు రేపు రాజ్యసభలో కూడా ఆమోదం పొందిన తర్వాత, కేంద్ర క్యాబినెట్ ద్వారా అధికారిక ప్రక్రియ పూర్తి అవుతుంది. 2014 పునర్వ్యవస్థీకరణ చట్టంలో అమరావతిని స్పష్టంగా పొందుపరచడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఒక బలమైన రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసింది.గత ప్రభుత్వ అనుభవాల దృష్ట్యా, పెట్టుబడిదారులు, ప్రపంచ బ్యాంకు లాంటి అంతర్జాతీయ సంస్థలు అమరావతిలో పెట్టుబడులు పెట్టడానికి ఒక స్పష్టమైన భరోసాను కోరుకున్నాయి. స్థానిక శాసనసభ ద్వారా ఏ క్షణంలోనైనా నిర్ణయాలు మార్చేయవచ్చనే భయాన్ని తొలగించడం అత్యవసరం. హైకోర్టు కూడా రాజధానిని మార్చే అధికారం కేవలం పార్లమెంటుకు మాత్రమే ఉందని స్పష్టం చేసిన నేపథ్యంలో, ఈ బిల్లు అమరావతి భవిష్యత్తుకు శాశ్వత భద్రతను ఇస్తుంది. ఇంకెవరూ, ఎన్నటికీ రాజధానిని కదల్చలేని విధంగా ఈ చట్టం ఒక "సర్టెన్టీ ని తీసుకువస్తుంది.

### పార్లమెంటు వేదికగా రాజకీయ వాస్తవాలు

ఈ కీలకమైన బిల్లుపై లోక్‌సభలో జరిగిన చర్చ రాజకీయ పక్షాల నైతికతను కళ్లకు కట్టింది. సమాజవాదీ పార్టీ, శివసేన, ఎన్సీపీ, బీజేపీతో సహా దేశంలోని అన్ని ప్రధాన పార్టీలు అమరావతికి ఏకగ్రీవంగా మద్దతు పలికాయి. రైతుల త్యాగాలను కొనియాడాయి. కానీ, ఆశ్చర్యకరంగా వైఎస్సార్సీపీ మాత్రమే ఈ బిల్లును వ్యతిరేకించి సభ నుండి వాకౌట్ చేయడం గమనార్హం. తాము చేసిన తప్పులను పార్లమెంటు సాక్షిగా అంగీకరించలేక, సభలో అసత్యాలు మాట్లాడుతూ, ప్రత్యామ్నాయ "ప్లాన్‌బి" అంటూ కొత్త వాదనలు తీసుకురావడం వారి రాజకీయ ఒంటరితనానికి నిదర్శనం.

### అన్నదాతల శ్రేయస్సే ప్రథమ కర్తవ్యం

చట్టబద్ధత ప్రక్రియ రేపు రాజ్యసభలో కూడా పూర్తి కాగానే, అమరావతి పునర్నిర్మాణ పనులు మరింత శరవేగంగా జరగనున్నాయి. సిఆర్డిఏ ద్వారా నిర్మాణ కార్యక్రమాలు వేగవంతం అవుతుండగా, అమరావతి త్రిసభ్య కమిటీలో సభ్యుడిగా ఉన్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పదే పదే ఒక విషయాన్ని స్పష్టం చేశారు: భూములిచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం. ఎక్కడైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించి, రైతుల పక్షాన నిలబడతామని ప్రభుత్వం ఇస్తున్న భరోసా రైతుల్లో మరింత ధైర్యాన్ని నింపుతోంది. అమరావతి అనేది కేవలం ఇటుకలు, సిమెంట్ తో కట్టే ఒక భవనాల సముదాయం కాదు; అది కోట్లాది మంది ఆంధ్రుల ఆత్మగౌరవానికి నిలువెత్తు ప్రతీక. అది ఎన్నో అవమానాలను, లాఠీ దెబ్బలను భరించి నెత్తురోడిన రైతుల దీక్షా ఫలితంగా రూపుదిద్దుకుంటున్న ప్రాణమున్న నగరం. పార్లమెంటులో రేపు రాజ్యసభ ఆమోదంతో పూర్తికానున్న ఈ చట్టబద్ధత ప్రక్రియ... సంకల్పం ముందు అహంకారం ఎప్పటికీ గెలవలేదని నిరూపించిన చారిత్రక తీర్పుగా మిగిలిపోతుంది. అమరావతి ఇకపై ఏ ఆటంకాలు లేకుండా శరవేగంగా అభివృద్ధి చెందుతూ, యావత్ దేశానికే ఒక రోల్ మోడల్ నగరంగా నిలవాలని ఆశిద్దాం.



- ప్రొద్దువాక భీమరావు

లోక్‌సభలో అమరావతికి దక్కిన ఈ చట్టబద్ధత ఒక చారిత్రక, ఆర్థిక అవసరం. గత ప్రభుత్వ అనుభవాల దృష్ట్యా, పెట్టుబడిదారులు, ప్రపంచ బ్యాంకు లాంటి అంతర్జాతీయ సంస్థలు అమరావతిలో పెట్టుబడులు పెట్టడానికి ఒక స్పష్టమైన భరోసాను కోరుకున్నాయి. స్థానిక శాసనసభ ద్వారా ఏ క్షణంలోనైనా నిర్ణయాలు మార్చేయవచ్చనే భయాన్ని తొలగించడం అత్యవసరం. హైకోర్టు కూడా రాజధానిని మార్చే అధికారం కేవలం పార్లమెంటుకు మాత్రమే ఉందని స్పష్టం చేసిన నేపథ్యంలో, ఈ బిల్లు అమరావతి భవిష్యత్తుకు శాశ్వత భద్రతను ఇస్తుంది. ఇంకెవరూ, ఎన్నటికీ రాజధానిని కదల్చలేని విధంగా ఈ చట్టం ఒక "సర్టెన్టీ ని తీసుకువస్తుంది.

చట్టబద్ధత ప్రక్రియ గురువారం రాజ్యసభలో కూడా పూర్తి కాగానే, అమరావతి పునర్నిర్మాణ పనులు మరింత శరవేగంగా జరగనున్నాయి. సిఆర్డిఏ ద్వారా నిర్మాణ కార్యక్రమాలు వేగవంతం అవుతుండగా, అమరావతి త్రిసభ్య కమిటీలో సభ్యుడిగా ఉన్న కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పదే పదే ఒక విషయాన్ని స్పష్టం చేశారు: భూములిచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడటమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం. ఎక్కడైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించి, రైతుల పక్షాన నిలబడతామని ప్రభుత్వం ఇస్తున్న భరోసా రైతుల్లో మరింత ధైర్యాన్ని నింపుతోంది.

# డోపమైన్ హిట్.. లైఫ్ ఫట్!

## స్మార్ట్ ఫోన్ మాయలో పడి మీ ఏకాగ్రతను కోల్పోతున్నారా? సైకాలజిస్ట్ హెచ్చరిక

డోపమైన్ మన మెదడులో విడుదలయ్యే ఒక న్యూరోట్రాన్స్‌మిటర్. దీనిని సాధారణంగా 'ఫీల్ గుడ్' హార్మోన్ అని పిలుస్తారు. మనం ఏదైనా కొత్త విషయాన్ని చూసినప్పుడు, రుచికరమైన ఆహారం తిన్నప్పుడు లేదా ప్రశంసలు పొందినప్పుడు మెదడులో డోపమైన్ విడుదలై మనకు ఆనందాన్ని, ఉత్తేజాన్ని ఇస్తుంది.

### మెదడుకు వల...

మొబైల్ ఫోన్‌లోని ప్రతి ఫీచర్ మన మెదడును ప్రేరేపించేలా రూపొందించబడింది. నోటిఫికేషన్లు: ఫోన్ రింగ్ అయినప్పుడు లేదా వైబ్రేట్ అయినప్పుడు, "ఏదో కొత్త విషయం వచ్చింది" అనే కుతూహలం మెదడులో డోపమైన్‌ను విడుదల చేస్తుంది. సోషల్ మీడియా 'లైక్స్': మనం పెట్టిన పోస్ట్‌కు లైక్ లేదా కామెంట్ రాగానే, అది ఒక రివార్డులా అనిపించి తక్షణ ఆనందాన్ని ఇస్తుంది.అనంతమైన స్క్రోలింగ్: రీల్స్ లేదా షార్ట్స్ స్క్రోల్ చేస్తున్నప్పుడు, ప్రతి సెకనుకు ఒక కొత్త విషయం కనిపిస్తూ మెదడుకు నిరంతరం 'డోపమైన్ హిట్స్' అందిస్తుంది.

### వ్యసనంగా ఇలా..

మన మెదడు ఎప్పుడూ సులభంగా వచ్చే ఆనందాన్ని కోరుకుంటుంది. దీనిని 'రివార్డ్ సర్క్యూట్' అంటారు.

**ప్రేరణ:**
ఖాళీగా ఉన్నప్పుడు లేదా బోర్ కొట్టినప్పుడు ఫోన్ తీస్తాం.

**చర్య:**
సోషల్ మీడియాను స్క్రోల్ చేస్తాం.

**ప్రతిఫలం:**
కొత్త సమాచారం లేదా లైక్స్ రూపంలో డోపమైన్ విడుదలవుతుంది. క్రమంగా, మెదడు ఈ స్థాయి ఆనందానికి అలవాటు పడిపోతుంది. దీనివల్ల సాధారణ విషయాల్లో (చదువు, పని, సంభాషణలు) ఆనందం కలగదు. ఫోన్ లేకపోతే అసహనం, ఆందోళన కలగడాన్నే 'మొబైల్ అడిక్షన్' అంటారు.

### మానసిక ఆరోగ్య ప్రభావం

నిరంతర డోపమైన్ హిట్స్ వల్ల కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి.

**ఏకాగ్రత తగ్గడం:**
మెదడు ఎప్పుడూ కొత్త ప్రేరణ కోసం వెతుకుతూ ఉండటం వల్ల ఒక విషయంపై దృష్టి పెట్టలేము.

**నిద్రలేమి:**
ఫోన్ నుండి వచ్చే బ్లూ లైట్, డోపమైన్ మెదడును అప్రమత్తంగా ఉంచి నిద్రను దూరం చేస్తాయి.

**డిజిటల్ ఫెటీగ్:**
మెదడు నిరంతరం సమాచారాన్ని ప్రాసెస్ చేయడం వల్ల త్వరగా అలసిపోతుంది.

**అటెన్షన్ హుష్...**
డోపమైన్ 'హిట్స్' మన ఏకాగ్రతను దెబ్బతీస్తాయి. ఒక మానసిక సంఘర్షణ మన మెదడు సహజంగానే తక్కువ శ్రమతో ఎక్కువ ఆనందాన్ని ఇచ్చే పనుల వైపు మొగ్గు చూపుతుంది. సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లు ఈ బలహీనతను 'డోపమైన్' ద్వారా వాడుకుంటాయి.

### 1. నిరంతర ఉద్దీపన

మనం ఒక పుస్తకం చదువుతున్నప్పుడు, ఒక ముఖ్యమైన పని చేస్తున్నప్పుడు మెదడు నిలకడగా తక్కువ స్థాయిలో డోపమైన్‌ను విడుదల చేస్తుంది. స్మార్ట్‌ఫోన్ వాడినప్పుడు, ప్రతి సెకనుకు ఒక కొత్త నోటిఫికేషన్ లేదా వీడియో ద్వారా 'ఇన్‌స్టంట్ డోపమైన్ హిట్స్' లభిస్తాయి. దీనివల్ల మెదడు ఈ వేగవంతమైన ఆనందానికి అలవాటు పడి, నెమ్మదిగా సాగే పనులపై ఏకాగ్రతను కోల్పోతుంది.

### 2. అటెన్షన్ ఫ్రాగ్మెంటేషన్

ఫోన్ పక్కన ఉన్నప్పుడు, ఏమీ రాకపోయినా "ఏదైనా మెసేజ్ వచ్చిందేమో" అని మనం ఫోన్ చూస్తుంటాం. దీనిని 'ప్రోయాక్టివ్ చెకింగ్' అంటారు. ప్రతిసారీ మనం పనిని ఆపి ఫోన్ చూడటం వల్ల మన ఏకాగ్రత ముక్కలైపోతుంది. ఒక్కసారి ఏకాగ్రత చెదిరితే, తిరిగి పూర్తిస్థాయిలో పనిపై దృష్టి పెట్టడానికి సగటున 23 నిమిషాలు పడుతుందని పరిశోధనలు చెబుతున్నాయి.

### 3. మెదడు 'వడపోత' శక్తి తగ్గడం

మన మెదడులో 'ప్రీఫ్రంటల్ కార్టెక్స్' అనే భాగం ఏది ముఖ్యమో, ఏది కాదో నిర్ణయిస్తుంది. నిరంతర డోపమైన్ హిట్స్ వల్ల ఈ భాగం బలహీనపడుతుంది. దీనివల్ల అనవసరమైన విషయాలను వదిలేసి, అవసరమైన దానిపై దృష్టి పెట్టే శక్తి తగ్గిపోతుంది.

### 4. బోర్‌డమ్ భరించలేకపోవడం

పూర్వం ఖాళీగా ఉన్నప్పుడు మనం ఆలోచించేవాళ్లం లేదా ప్రకృతిని గమనించేవాళ్లం. కానీ ఇప్పుడు ఒక్క నిమిషం బోర్ కొట్టినా వెంటనే ఫోన్ తీస్తున్నాం. దీనివల్ల మెదడుకు విశ్రాంతి లేకుండా పోతోంది. ఏకాగ్రత పెరగడానికి మెదడుకు కొంత ఖాళీ సమయం అవసరం, కానీ డోపమైన్ హిట్స్ ఆ అవకాశాన్ని ఇవ్వవు.

### ఏకాగ్రతను ఎలా పెంపొందించుకోవాలి?

**మోనో-టాస్కింగ్:**
ఒకే సమయంలో ఒకే పని చేయడం అలవాటు చేసుకోవాలి. ఫోన్ చూస్తూ చదవడం లేదా తింటూ పని చేయడం మానుకోవాలి.

**డోపమైన్ డిటాక్స్:**
రోజులో కనీసం 12 గంటలు ఎటువంటి డిజిటల్ పరికరాలు లేకుండా గడపాలి. ఇది మెదడులోని డోపమైన్ గ్రాహకాలను తిరిగి సాధారణ స్థితికి తెస్తుంది.

**డీప్ వర్క్:**
ఫోన్‌ను పక్క గదిలో ఉంచి, కనీసం 45 నిమిషాల పాటు పూర్తి ఏకాగ్రతతో పని చేయడం ప్రాక్టీస్ చేయాలి.

**నోటిఫికేషన్లు ఆపివేయండి:**
అనవసరమైన యాప్స్ నోటిఫికేషన్లు ఆఫ్ చేయడం వల్ల 'యాంటిసిపేషన్' తగ్గుతుంది.

**గ్రే స్కేల్ మోడ్:**
ఫోన్ స్క్రీన్‌ను బ్లాక్ అండ్ వైట్ లోకి మార్చడం వల్ల మెదడుకు కలిగే ఆకర్షణ తగ్గుతుంది.

**డెడ్ జోన్స్:**
భోజనం చేసేటప్పుడు, పడుకునే ముందు ఫోన్‌ను దూరంగా ఉంచడం అలవాటు చేసుకోవాలి.

**ప్రత్యామ్నాయాలు:**
డోపమైన్ కోసం ఫోన్ కాకుండా వ్యాయామం, పుస్తక పఠనం లేదా తోటపని వంటి సహజమైన పనులను ఎంచుకోవాలి.



# బూర్గంపాడులో భారతి భవన్ ఆవాస వార్షికోత్సవం ఘనంగా నిర్వహణ




**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల కేంద్రంలోని భారతి భవన్‌లో వనవాసి వికాస కేంద్రం సేవా సమితి ఆధ్వర్యంలో ఆవాస వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బూర్గంపాడు సర్పంచ్ మందా నాగరాజు ముఖ్య అతిథిగా హాజరైనారుకార్యక్రమం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పాటలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను అభినందించిన సర్పంచ్, వారిని ఉత్సాహపరిచారు.ఈ సందర్భంగా మాట్లాడిన మందా నాగరాజు, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలు జీవితంలో ఎంతో ముఖ్యమని తెలిపారు. భారతి భవన్‌కు మంచి పేరు తెచ్చేలా విద్యార్థులు ప్రతిభ కనబరచాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, సేవా సమితి సభ్యులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. వేడుకలు ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిశాయి.

# మణుగూరులో 92 శాతం బొగ్గు ఉత్పత్తి..

- మార్చి నెల లక్ష్యంలో 94 శాతం పూర్తి..
- ఏరియా జిఎం దుర్గం రామచందర్ వెల్లడి




**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ఏరియాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బొగ్గు ఉత్పత్తిలో గణనీయమైన పురోగతి సాధించామని ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ తెలిపారు. బుధవారం జిఎం కార్యాలయ సమావేశ మందిరంలో మీడియాతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి నెలలో 10 లక్షల 68 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 9 లక్షల 99 వేల 738 టన్నులు ఉత్పత్తి చేసి 94 శాతం లక్ష్యాన్ని చేరుకున్నామని తెలిపారు. అలాగే 2025 ఏప్రిల్ 1 నుండి 2026 మార్చి 31 వరకు మొత్తం 114 లక్షల 90 వేల టన్నుల లక్ష్యానికి గాను 105 లక్షల 35 వేల టన్నులు ఉత్పత్తి చేసి 92 శాతం ప్రోగ్రెస్సివ్ సాధించినట్లు వివరించారు. రవాణా విషయానికొస్తే మార్చి నెలలో 12 లక్షల 22 వేల 430 టన్నుల బొగ్గును రవాణా చేసినట్లు చెప్పారు. అలాగే ఏడాది మొత్తంలో 109 లక్షల 82 వేల 850 టన్నులు రవాణా చేసి లక్ష్యానికి దగ్గరగా ఉన్నామని వెల్లడించారు. ఓవర్ బర్డెన్ తొలగింపులో మార్చి నెల 15 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 14 లక్షల 42 వేల క్యూబిక్ మీటర్లు తీయడంతో 96 శాతం సాధించినట్లు తెలిపారు. కాగా, ఏడాది మొత్తంలో 170 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 134 లక్షల 71 వేల క్యూబిక్ మీటర్లు తీయడం ద్వారా 84 శాతం సాధించినట్లు చెప్పారు. ఉద్యోగుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, పదవి విరమణ, మెడికల్ ఇన్వాలిడేషన్ లేదా మరణించిన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు ప్రోగ్రెస్సివ్ లో కొనసాగుతున్నాయని తెలిపారు. మొత్తం 71 మంది వారసులకు నియామక ప్రక్రియ కొనసాగుతోందన్నారు. సిఎంపిఎఫ్, గ్రాట్యుటీ చెల్లింపులు సకాలంలో జరుగుతున్నాయని, పారిశ్రామిక సంబంధాలు సంతృప్తికరంగా ఉన్నాయని వెల్లడించారు. ఈ సమావేశంలో ఏరియా అధికారులు ఎస్ఓటు జిఎం శ్రీనివాసచారి, బిజిఎం పర్సనల్ సలగల రమేష్, వివిధ విభాగాధిపతులు, గనుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో విత్తనాలు పంపిణీ

**అన్ని వర్గాల రైతులకు వంద శాతం సబ్సిడీ.. హెచ్‌ఈఓ వసంత**



**జూలూరుపాడు, మహా:** పండ్ల తోటలు, కూరగాయ పంటల సాగును ప్రోత్సహిస్తూ, ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో బుధవారం మండల పరిధి పడమట నర్సాపురం గ్రామపంచాయతీ కార్యాలయంలో అన్ని వర్గాల రైతులకు వంద శాతం సబ్సిడీపై కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యానవన విస్తరణాధికారి వసంత మాట్లాడుతూ కూరగాయ పంటలపై క్రిమి సంహారక మందుల వాడకం పెరిగి, అవి తిని నేడు అనేకమంది అనారోగ్యాల బారిన పడుతున్నారని అన్నారు. పెరటి తోట కూరగాయల పెంపకాన్ని ప్రోత్సహించడంతోపాటు, సేంద్రీయ పద్ధతిలో కూరగాయలను సాగు చేసి తినడం ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. సుమారు ఇరవై కుంటల పెరటిలో సాగుకు సరిపడా టమాటా, మిర్చి, బెండకాయ, తోటకూర, పాలకూర లాంటి ఐదు రకాల విత్తనాలను గ్రామ సర్పంచ్ సంఘం లక్ష్మీ కుమారి, కార్యదర్శి బి హారిక తో కలిసి రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. సాగు అనంతరం పెరటి తోటలను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. రైతులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకొని, సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అలవర్చుకొని, కూరగాయల సాగులో మెలకువలు తెలుసుకొని, తద్వారా లావాలను పొందడంతో పాటు, ఆరోగ్యాలను కాపాడుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన రైతులతోపాటు, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.


# కృష్ణసాగర్ సర్పంచ్ ఆధ్వర్యంలో సామూహిక అన్నప్రాసన కార్యక్రమం



**బూర్గంపహాడ్ :** కృష్ణసాగర్ గ్రామపంచాయితీ పరిధిలోని కృష్ణసాగర్ ఎస్టీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ ఆధ్వర్యంలో సామూహిక అన్నప్రాసన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ తాటి వాణి గారు, ఉప సర్పంచ్ భూక్య మోహన్ రావు గారు హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ తాటి వాణి గారు మాట్లాడుతూ, ఆరు నెలలు నిండిన శిశువులకు తల్లి పాలతో పాటు అదనపు పోషకాహారం ప్రారంభించేందుకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించడం ముఖ్యమని తెలిపారు. శిశువుల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, పోషకాహార లోపాన్ని నివారించడం, వారి సమగ్ర ఎదుగుదలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని వివరించారు. అలాగే తల్లులు పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో శ్రద్ధ వహించాలని, ఆరోగ్యంగా ఉండాలని సూచించారు.అంగన్వాడీ టీచర్ పుల్లమ్మ సేవలను సర్పంచ్ ప్రత్యేకంగా కొనియాడారు. అనంతరం అంగన్వాడీ లెవల్ మానిటరింగ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా అంగన్వాడీ సిబ్బంది సర్పంచ్ తాటి వాణి , ఉప సర్పంచ్ భూక్య మోహన్ రావు సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు బాధవత్ సురేష్, గుండి వెంకటేశ్వర్లు, మడకం దేవా, పద్దం రాజు, ఎంపి పి ఎస్ హెడ్‌మాస్టర్ కోటేశ్వరరావు , భీముడు టీచర్ , అంగన్వాడీ టీచర్ పుల్లమ్మ , ఆశ వర్కర్లు మరియు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తాం

**నూతన సభ్యుల హామీ.. రైస్ మిల్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు బుధవారం స్థానిక జిల్లా కేంద్రంలోని సూర్య ప్యాలెస్ హోటల్‌లో నిర్వహించారు. ఈ ఎన్నికలు అసోసియేషన్ సభ్యుల సమక్షంలో స్నేహపూర్వక వాతావరణంలో ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏకగ్రీవ నిర్ణయాలతో నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేయడం విశేషంగా నిలిచింది. ఈ ఎన్నికల ద్వారా రాబోయే మూడు సంవత్సరాల కాలానికి(ఏప్రిల్ 142026 నుండి మార్చి 31, 2029 వరకు) కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.నూతన కమిటీ ఇలా...అధ్యక్షులుగా జుగల్ కిషోర్ ఖండేల్వాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, కార్యదర్శిగా ఏలిపిద్ది శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారిగా పల్లపోతు శ్రీనివాసు(వాసు)ఎన్నిక కాగా ఇతర కార్యవర్గ సభ్యులను కూడా సభ్యుల సమ్మతితో నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ జిల్లా రైస్ మిల్ పరిశ్రమ అభివృద్ధి సభ్యుల సంక్షేమం సమస్యల పరిష్కారం సమగ్ర పురోగతికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. సభ్యులందరూ కొత్త కమిటీకి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు.

# మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా..?

**పాఠశాలలో సిబ్బంది తీరుపై కలెక్టర్ అంకిత్ ఆగ్రహం**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా అంటూ జిల్లా కలెక్టర్ అంకిత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దమ్మపేట మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం విస్తృత పర్యటన నిర్వహిస్తూ తహసీల్దార్ కార్యాలయం పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న సేవలు విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు ముఖ్యంగా మధ్యాహ్న భోజన నాణ్యతపై సమగ్రంగా ఆరా తీశారు. మొదటగా దమ్మపేట తహసీల్దార్ కార్యాలయాన్ని పరిశీలించిన కలెక్టర్ కార్యాలయంలోని అన్ని విభాగాలను తనిఖీ చేసి దరఖాస్తుల పరిష్కార విధానంపై అధికారులను ప్రశ్నించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడి కుల ధృవీకరణ ఆదాయ నివాస ధృవీకరణ రేషన్ కార్డుల వంటి దరఖాస్తుల పురోగతిని తెలుసుకున్నారు. దరఖాస్తులను నిర్ణీత గడువులోనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. మీ సేవ ద్వారా చెల్లించవలసిన రుసుముల వివరాలను కార్యాలయంలో స్పష్టంగా ప్రదర్శించాలని సూచించారు. భూ సమస్యలు సర్టిఫికెట్ల జారీ వంటి అంశాలు మండల స్థాయిలోనే పరిష్కారం కావాల్సి ఉండగా ప్రజలు ప్రజావాణి కార్యక్రమానికి ఎందుకు దూర ప్రాంతాల నుంచి రావాల్సి వస్తోందని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. సమస్యలను స్థానికంగానే త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రికార్డు రూమ్‌ను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమావేశమై విద్యుత్ మిషన్ భగీరథ ఇరిగేషన్ వ్యవసాయం పోలీస్ శాఖల పనితీరును సమీక్షించారు. గ్రామసభల నిర్వహణకు పూర్తి ఏర్పాట్లు చేయాలని వేసవి కాలంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం దమ్మపేట తెలంగాణ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధంగా ఉన్న భోజనాన్ని నేరుగా పరిశీలించారు. మెనూ ప్రకారం ఆ రోజు చికెన్ బగారా రైస్ అందించాల్సి ఉండగా అది అందుబాటులో లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్ మెనూ పాటించకపోవడంపై సంబంధిత సిబ్బందిని ప్రశ్నించారు. విద్యార్థులకు అందించవలసిన ఆహారాన్ని ఎందుకు ప్రదర్శించడం లేదని వెంటనే ప్రదర్శించాలని ఆదేశించారు. విద్యార్థులకు వడ్డించడానికి సిద్ధంగా ఉన్న ఆహారాన్ని స్వయంగా రుచి చూసిన కలెక్టర్ ఆహార నాణ్యతపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "మీ పిల్లలకు కూడా ఇలానే భోజనం పెడతారా?" అని ప్రశ్నిస్తూ వంట సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్మేకర్ కూర సరిగా నువ్వు ఉడక పోవడం రుచి నాణ్యత లోపించడం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ విద్యార్థులకు పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారం అందించాలని భవిష్యత్తులో నిర్లక్ష్యం పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు చేతులు శుభ్రం చేసుకునే ప్రదేశంలో కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడంతో నీరు వృథాగా పోతున్న పరిస్థితిని గమనించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం మందలపల్లి క్రాస్ రోడ్డు వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలను పరిశీలించిన కలెక్టర్ అక్కడ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజన నాణ్యత, సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. స్టోర్ రూమ్‌ను పరిశీలించి కూరగాయలు ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు. వంటశాలలో గ్యాస్ సిలిండర్ల నిల్వలు భద్రతా చర్యలపై ఆరా తీసి భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు.విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం ద్వారా వారి ఆరోగ్యం అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ రామ్ నరేష్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి, ఎంఈఓ జగదీష్, ఉపాధ్యాయురాలు స్టెల్లా, వార్డెన్ దుర్గ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# మొక్కజొన్న కోతలు పూర్తయిన కొనుగోలు కేంద్రాలు ప్రారంభించలేదు

**కారేపల్లి, మహా :** మొక్కజొన్న కోతలు పూర్తి అయినా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవటంతో రైతులు అవసరాలు తీర్చుకోవటానికి, అప్పులు కట్టటానికి అరకొర ధరకు పంటను విక్రయించాల్సి వస్తుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు వజ్జా రామారావు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కారేపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్తి, మిర్చి పంటలు పూర్తిగా దెబ్బతినటంతో అధికశాతం రైతులు మొక్కజొన్న పంటను సాగుచేశారన్నారు. ప్రభుత్వ ధర రూ.2400 ఉంటే ప్రయివేటు వ్యాపారులు కేవలం రూ.1600 లకు కొనుగోలు చేస్తున్నారన్నారు. దీంతో పండిన పంట పెట్టుబడికే సరిపోతుందన్నారు. యాసంగి వరి పంట కోతకు వచ్చిందని వెంటనే మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా పైకాన్ని ఎకరం వరకు ఇచ్చిన ప్రభుత్వం తర్వాత ముందుకు సాగటం లేదన్నారు. రబీలో పెట్టుబడికి రైతు భరోసా అసరాగా ఉంటుందని ఆశిస్తే ప్రభుత్వం పైకం విడుదలలో వాయిదాలు పెడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రవేశ పెట్టిని ఏ ఒక్క పథకం పూర్తి స్థాయిలో అమలు చేయక పోవటంతో రైతులు అగ్రహంతో ఉన్నారన్నారు. రైతుభరోసా వెంటనే పూర్తిస్థాయిలో అమలు చేయాలని, రూ. 2లక్షల రుణమాఫీ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు, ఈకార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు ముండ్ల ఏకాంబరం, నాయకులు పండగ కొండయ్య, కరపటి సీతారాములు, పాసిన్ని నాగేశ్వరరావు, వల్లభినేని మురళి, షేక్ సైదులు, బోజెడ్ల గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సభలు గ్రామాల సమస్యల పరిష్కార వేదికలు కావాలి



**కారేపల్లి, మహా:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న ప్రజాపాలన గ్రామ సభలు ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ఉండాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం కారేపల్లి లో విలేకరులతో మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ప్రజా పాలన సందర్భంగా ప్రజల నుండి దరఖాస్తు సేకరించి అనేక సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక చేశారని అవి కేవలం కాగితాలకే పరిమితమైందన్నారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయకపోగా కొత్త హామీలు గుప్పిస్తున్నారని విమర్శించారు. అర్హులైన మహిళలకు రూ.2500, భూమిలేని పేదలకు ఏడాదికి రూ. 12వేలు ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డు లేని కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు, రైతులకు రైతు భరోసా, పంటలకు బోనస్, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు, అర్హులైన వారికి వృద్ధాప్య, వితంతు, వికలాంగులకు కొత్త పెన్షన్ల మంజూరు చేయాలన్నారు ఆడబిడ్డల వివాహాలకు కల్యాణ లక్ష్మి, షాది ముబారక్ తులం బంగారం, ఆటో డ్రైవర్లకు రూ .12 వేల ఉద్యమ కారులకు విలేఖరుల కు ఇల్లు, ఇళ్ల స్థలాలు ప్రతి ఉపాధి కూలీకి 150 రోజుల పని, రోజు కూలి రూ. 400 లాంటి హామీలపై గ్రామ సభలలో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# నాలుగు లేబర్ కోడ్లను తెలంగాణలో అమలు చేయొద్దు

**కలెక్టరేట్ వద్ద బ్లాక్ డే నిరసనలో కార్మిక సంఘాల నాయకుల డిమాండ్**




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఏప్రిల్ ఒకటి నుండి దేశంలో నాలుగు లేబర్ కోడ్లను అమలుచేయాలని మోడీ ఆదేశాలు ఇవ్వడం కార్మిక వ్యతిరేకమైనదని కార్పొరేట్ల సంపద పెంపుకోసం కార్మికుల గొంతుకు ఉరితాడు బిగించడానికి సిద్ధం కావడం దుర్మార్గమైందని కార్మిక సంఘాల నేతలు ఎస్ ఏ.జలీల్, జే.సీతారామయ్య, కంచర్లజమలయ్య, దొడ్డా రవికుమార్, షేక్.యాకుబ్ షావలి అన్నారు. నాలుగు లేబర్ కోడ్లను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయమని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన చేయాలని వారు డిమాండ్ చేశారు. యావత్తు కార్మిక వర్గం లేబర్ కోడ్లను వ్యతిరేకిస్తూ సార్వత్రిక సమ్మెలను నిర్వహించి తమ వ్యతిరేకత తెలియజేసినప్పటికీ మోడీ ప్రభుత్వం కార్మిక ప్రయోజనాల కన్నా అంబానీ, అదాని లాంటి పెట్టుబడి దారులకు సంపదలను కట్ట బెట్టటమే లక్ష్యంగా లేబర్ కోడ్లను అమలు చేయటానికి పూనుకోవడం సిగ్గుచేటన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆఫీసు వద్ద జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టియుసి, ఐఎఫ్‌టియు, సిఐటియు, ఎఐటియుసి, టియుసిఐ సంఘాల నాయకుల ప్రసంగించారు. ఎన్నో కార్మిక సమ్మె పోరాటాలు త్యాగాలతో సాధించి అనుభవిస్తున్న 29 కార్మికచట్టాలను బిజెపి ప్రభుత్వం రద్దుచేసిందని నాలుగు లేబర్ కోడ్ల కార్మిక వర్గ ప్రయోజనాలకు ఎంత మాత్రం ఉపయోగపడవని తెలిపారు. కార్మిక మనుగడ హక్కులు సౌకర్యాలను సమాధిచేసే ఉద్దేశంతోనే లేబర్ కోడ్లు ఉన్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నాలుగు లేబర్ కోడ్లను అమలు చేసేదిలేదని ప్రభుత్వం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎన్‌టియుసి త్యాగరాజన్, కాయల నాగభూషణం, పితాంబరం, ఐఎఫ్‌టియు గౌని నాగేశ్వర రావు, ఎన్. సంజీవ్, మల్లికార్జున్ రావు, సిఐటియు భూక్య రమేష్, కే.సత్య, తులసి రామ్, మధుసూదన్ రెడ్డి, సతీష్, వెంకన్న, ఎఐటియుసి ఎం.రాజు, ఎం.వెంకటేశ్వర్లు, రాజేశ్వరి, శిరీష, పద్మ, వాణి, క్రాంతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లిలో కార్మికుల నిరసన




**కారేపల్లి, మహా:** దేశానికి సంపద సృష్టించి, కోట్లాదిమంది ఆకలి తీర్చే, మానవాళికి కావలసిన సరుకులను ఉత్పత్తి చేసే కష్టజీవుల పట్ల మోడీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందని సిఐటియు సింగరేణి మండల కన్వీనర్ కే నరేంద్ర విమర్శించారు. బుధవారం కార్మిక కర్షకులకు వ్యతిరేకమైన చట్టాలను అమలు జరుపుతున్న ఏప్రిల్ 1 రోజున "బ్లాక్ డే" గా భారత శ్రామిక వర్గం జరుపుకుంటున్నదని దీనిని అలా జరుపుకునే విధంగా చేసినది కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అని కే నరేంద్ర పేర్కొన్నారు. బ్లాక్ డే సందర్భంగా సింగరేణి మండల తహసీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు సింగరేణి మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలియజేసి మండల తహసీల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కె నరేంద్ర మాట్లాడుతూ కార్మికులకు వ్యతిరేకమైన 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకువచ్చి ఏప్రిల్ ఒకటి నుంచి అమలు చేయనున్నదని ఇది కార్మికులకు కార్మికుల శ్రమను దోపిడీ చేయడానికి కార్పొరేట్ శక్తులకు లైసెన్స్ వంటిదని విమర్శించారు. ఈ లేబర్ కోడ్ లను రద్దుచేసి 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును మార్చి జీ రాంజీ బిల్లుగా తెచ్చి పథకాన్ని నేరుగార్చాలని, వ్యవసాయ కూలీలకు పని లేకుండా చేసే కుట్రగా దీనిని అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ చట్టం వల్ల రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టి బిల్లులు వసూలు చేసే కుట్రని ఇప్పటికే అతివృష్టి అనావృష్టి సమస్యలతో పాటు నకిలీ విత్తనాలు ఎరువులు, పురుగు మందులు కారణంగా రైతు నష్టపోతున్నాడని గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్న క్రమంలో పెట్టుబడి పెరిగి అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నా పరిస్థితి ఉందని దీనికి తోడు మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టుగా విద్యుత్తు బిల్లులు కూడా పడనున్నాయన్నారు. ఈ బిల్లును వెంటనే రద్దు చేసి రైతుల్ని కాపాడాలని కె నరేంద్ర డిమాండ్ చేశారు. నల్ల చట్టాల రద్దు క్రమంలో కనీసం మద్దతు ధర చట్టం పార్లమెంట్లో చేస్తామని చెప్పి ఏండ్లు గడుస్తున్నా మోడీ మాట తప్పేరని ఇది రైతులపై మోడీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేని తనాన్ని తెలియజేస్తున్నదన్నారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే కనీసం మద్దతు ధర చట్టం తేవాలని కే నరేంద్ర డిమాండ్ చేశారు. కార్మిక కర్షక వ్యతిరేక విధానాన్ని విడనాడాలని లేనియెడల ఉధృతమైన పోరాటాలు చేస్తామని కార్మిక కర్షక మైత్రితో ముందుకు పోతామనకే నరేంద్ర హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో హమాలి యూనియన్ నాయకులు గాడు ఆరెల్లి శ్రీరాములు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు శనగ రాంబాబు, గజ్జల శీను, ఉపేందర్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు గుగులోత్ శ్రీను, కోటయ్య, బాబు, రైతులు కల్తి భద్రయ్య, వాంకుడోత్ బాబురావు పాల్గొన్నారు.



# గ్రామ సభలను విజయవంతం చేయండి

**ఎంపీడీఓ తాళ్లూరి రవి**

**జూలూరుపాడు, మహా:** జిల్లా కలెక్టర్ భద్రాద్రి కొత్తగూడెం వారి ఆదేశాల మేరకు, ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా 02 ఏప్రిల్ 2026 న ఉదయం 9:00 గంటలకు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ గ్రామ సభలలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై చర్చించడం జరుగుతుందన్నారు. అందువలన క్రింది పథకాల లబ్ధిదారులు, అర్హులైన ప్రజలందరూ తప్పనిసరిగా గ్రామ సభలలో పాల్గొనాలని కోరారు. కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు రుణమాఫీ, సన్న బియ్యం, మహాలక్ష్మి, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులతోపాటు, గ్రామ ప్రజలందరూ గ్రామ సభలకు హాజరై తమ అభిప్రాయాలు, సమస్యలు తెలియజేసి కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలనిమండల అభివృద్ధి అధికారి తాళ్లూరి రవి పత్రికా ప్రకటనలో కోరారు.



# మంగళ తోరణాలతో ప్రారంభమైన అంకమ్మ జాతర

- కార్యక్రమంలోపాల్గొన్న మాజీ ఎంపీపీ,సర్పంచ్ గొడ్ల ప్రభాకర్,
- మాజీ సర్పంచ్ దొడ్డ నిర్మల,మరియు జాతర కమిటీ సభ్యులు ...

**తల్లాడ, మహా** అన్నారుగూడెంలో ఐదు రోజులు అంకమ్మ జాతర జరగనున్న నేపథ్యంలో మొదటి రోజు బుధవారం ఉదయం మంగళ తోరణాలతో, విగ్నేశ్వర పూజతో ఎంతో వైభవంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ లు పాల్గొని తోరణపాకు కట్టి దేవాలయానికి అలంకరించారు. అనంతరం వారు జాతర కమిటీ సభ్యులతో మాట్లాడి జాతర సజావుగా జరిగేలా చూడాలని కమిటీని వారు కోరారు.అంతేకాకుండా రాత్రి జరగబోయే అమ్మవార్ల ఊరేగింపు ఘనంగా జరగాలని ఎక్కడ అవాంతరానీయ సంఘటనలు జరగకుండా ఎప్పటికప్పుడు అంకమ్మ జాతర కమిటీ వారియర్స్ పర్యవేక్షణ ఉండాలని ఈ ఐదు రోజులు జరిగే జాతర జిల్లాలోనే మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చేలా ఉండాలని కమిటీకి వారు ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్,మరియు తల్లాడ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, అన్నారుగూడెం గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఆ గ్రామ మాజీ సర్పంచ్ దొడ్డ నిర్మల, జాతర కమిటీ సభ్యులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు, మారెళ్ళ దేవేందర్, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, దొబ్బల శ్రీనివాసరావు, పేరసాని నరసింహారావు, దుగ్గినేని సత్యనారాయణ, దొబ్బల శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు,రైతులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రమకు తగ్గట్టుగా వేతనం ఇవ్వాలి

- కమిషనర్ కు కార్మికుల వినతి
- నూతన కార్పొరేటర్ లు అందరూ కార్మికులకు అండగా నిలవాలి
- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా రమేష్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా రమేష్ కోరారు. కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందించారు. చాలీచాలని వేతనాలు వస్తున్నాయని కార్మికుల రక్షణ కోసం ఆరోగ్యం కోసం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికులకు కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న ప్రతి మున్సిపల్ కార్మికులకి 22, 750 రూపాయలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ నిర్లక్ష్యం తగదని వెంటనే కార్పొరేషన్ సమావేశాల్లో తీర్మానం చేసి ప్రతి మున్సిపల్ కార్మికుడికి 22,750 రూపాయలు ప్రతి నెల వేతనం చెల్లించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా మున్సిపల్ నాయకురాలు అంబాల దుర్గమ్మ, కార్మికులు పుట్ట సుశీల, సరిత, లక్ష్మి, అంబాల సీత, అంబాల రాజమణి, సంజీవ్, రఫీ, హరిత, సుధా, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎయిర్టెల్ సెల్ టవర్ నిర్మాణంపై గ్రామస్తుల అభ్యంతరం



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలం నాగినేని ప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో ప్రతిపాదిత ఎయిర్టెల్ సెల్ టవర్ నిర్మాణ పనులపై గ్రామస్తులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఈ అంశంపై గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్ అంకిత్‌కు ఫిర్యాదు చేయగా, సమస్యను పరిశీలించేందుకు డిఆర్డిఏ అధికారి బుధవారం గ్రామాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు టవర్ నిర్మాణం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అలాగే నివాస ప్రాంతానికి సమీపంలో టవర్ ఏర్పాటు చేయడం సరైంది కాదని తమ ఆందోళనలు వ్యక్తం చేశారు. వెంటనే పనులు నిలిపివేయాలని అధికారిని కోరారు. గ్రామస్థుల అభ్యర్థనలను శ్రద్ధగా విన్న డిఆర్డిఏ అధికారి, సంబంధిత విషయాలను ఉన్నతాధికారులకు నివేదించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభలు నేడే



**బూర్గంపహాడ్ మహా :**బూర్గంపాడు మండలంలో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక (99 రోజుల కార్యాచరణ ప్రణాళిక)లో భాగంగా గ్రామస్థాయిలో విస్తృత కార్యక్రమాలు చేపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ రోజు ఉదయం 9:30 గంటలకు మండలంలోని మొత్తం 18 గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.ఈ గ్రామసభలు ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించబడతాయి. ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం, గ్రామాల అభివృద్ధి అవసరాలను గుర్తించడం, సమస్యలను నేరుగా తెలుసుకోవడం మరియు వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడం ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశంగా అధికారులు తెలిపారు.ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధిని వేగవంతం చేయాలన్న లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజరై తమ సమస్యలు, అభిప్రాయాలు వెల్లడించాలని అధికారులు కోరుతున్నారు.

## శరణం అయ్యప్పా శరణు ఘోషతో మారుమ్రోగిన మణుగూరు..

- వైభవంగా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు..
- 3 వేల మందికి అన్నప్రసాదాలు..



**మణుగూరు, మహా :** స్వామి శరణం అయ్యప్పా.. శరణుఘోషతో మణుగూరు పట్టణం మారుమ్రోగింది. హరిహరసుతుడైన శ్రీ అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలను మండలంలోని అయ్యప్ప పీఠాల గురుస్వాములు, భక్తజనుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వేదికలో భక్తి శ్రద్ధల మధ్య కార్యక్రమాలు జరిగాయి. ఉదయం నుంచే అర్చకులు ఉప్పల శ్రీకర్, అద్వైత్ శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక కలశ పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులకు అష్టదశ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించి, అష్టదిక్పాలకుల మంత్రోచ్చారణల మధ్య హోమం చేశారు. ముందుగా గణపతి పూజలు నిర్వహించి, ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి పుష్పాలతో అలంకరించారు. పూలమాలలతో అలంకరించిన స్వామి వారి దర్శనం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. అయ్యప్ప స్వామికి నైవేద్యంగా వివిధ వంటకాలను సమర్పించి, అనంతరం తీర్థప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమం అంతటా అయ్యప్ప శరణుఘోషలతో ప్రాంగణం మారుమ్రోగింది. భక్తులు పెద్దఎత్తున హాజరై మణికంఠ స్వామిని దర్శించుకుని పులకించారు. అనంతరం అయ్యప్ప పీఠాల గురుస్వాములు, భక్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. సుమారు 3 వేల మందికి పైగా భక్తులు, పట్టణ ప్రజలు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ అయ్యప్ప పీఠాల గురుస్వాములు, ప్రముఖ భక్తులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో నిర్వాహకులు, స్వచ్ఛంద సేవకులు విశేష కృషి చేశారు.

## జిల్లా జడ్జిని కలిసిన మణుగూరు బార్ నూతన కమిటీ..

- న్యాయసేవల అభివృద్ధిపై చర్చ..
- కమిటీకి శుభాకాంక్షలు తెలిపిన జడ్జి వసంత్ పాటిల్..



**మణుగూరు, మహా :**మణుగూరు బార్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు జిల్లా జడ్జి వసంత్ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఇటీవల నూతన కమిటీ ఏర్పాటైన నేపథ్యంలో సభ్యులు ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.ఈ సందర్భంగా న్యాయవాదుల సంక్షేమం, కోర్టు పరిధిలో నెలకొన్న సమస్యలు, న్యాయసేవల అభివృద్ధి వంటి కీలక అంశాలపై చర్చించారు. జిల్లా జడ్జి వసంత్ పాటిల్ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ, న్యాయవాదులు న్యాయవ్యవస్థ పట్ల నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. కోర్టు కార్యకలాపాలు సజావుగా సాగేందుకు తమ వంతు సహకారం అందిస్తామని బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రకాని గురుకృష్ణ, వైస్ ప్రెసిడెంట్ నిమ్మనగోటి సావిత్రి, జనరల్ సెక్రటరీ కామసాని వీర మధుసూదన్, స్పోర్ట్స్ & కల్చరల్ సెక్రటరీ నాగార్జునరెడ్డి, అసోసియేషన్ సభ్యులు ఎస్.వి రమణారెడ్డి, రామ్మోహనరావు, బిద్దం శ్రీనివాస్ రెడ్డి, సర్వేశ్వరరావు, రమేష్, వాసవి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు పథకాలను
## ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించవద్దు

**భవన నిర్మాణ కార్మికుల డిమాండ్లు**



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలం సారపాక లో సీఐటీయూ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల జనరల్ బాడీ సమావేశం బుధవారం తోట మల్లయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సీఐటీయూ గౌరవ అధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డు పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించరాదని, జీవో నం.12ను సవరించి సంక్షేమ పథకాలు నేరుగా వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికులకు అందించాలని డిమాండ్ చేశారు.కార్మికుల కష్టంతో నిర్మితమైన భవనాల్లో ప్రజాప్రతినిధులు అన్ని సౌకర్యాలు అనుభవిస్తున్నప్పటికీ, కార్మికులకు సరైన సంక్షేమం అందడం లేదని విమర్శించారు. సిఎస్పీ హెల్త్ టెస్ట్ పేరుతో భారీగా ప్రైవేట్ కంపెనీలకు నిధులు వెళ్తుండగా, కార్మికులకు ఇవ్వాల్సిన పరిహారం సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉందని అన్నారు.

**ప్రధాన డిమాండ్లు:**
వెల్ఫేర్ బోర్డును బలోపేతం చేయాలిగడువు ముగిసిన కార్డులను వెంటనే రీన్యువల్ చేయాలిసిఎస్పీ హెల్త్ టెస్టులను రద్దు చేయాలిసహజ మరణానికి ₹5 లక్షల ఇన్సూరెన్స్ కల్పించాలిఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు పండు రమణయ్య, జైనుల్, హనుమాన్, వీరయ్య, స్వామి, ప్రేమ్‌చంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లె ప్రకృతి వనంలో మోటార్ దొంగతనం



**బూర్గంపహాడ్ మహా :**బూర్గంపహాడ్ మండలంలోని ఇరవెండి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పల్లె ప్రకృతి వనంలో బోరు మోటార్ దొంగతనం చోటు చేసుకుంది. మంగళవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మోటార్‌ను అపహరించినట్లు సమాచారం.బుధవారం ఉదయం సర్పంచ్ బాబురావు, ఉప సర్పంచ్ మహంకాళి రామారావు సంఘటనా స్థలాన్ని పరిశీలించగా మోటార్ గల్లంతైన విషయం బయటపడింది. దీంతో వారు వెంటనే బూర్గంపహాడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

## రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా వెంకటరెడ్డికి..



**రెడ్డి సంక్షేమ సమైక్య ఆధ్వర్యంలో సన్మానం..**

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సానికొమ్ము వెంకటరెడ్డి (మైత్రి)ను రెడ్డి సంక్షేమ సమైక్య మణుగూరు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పట్టణంలోని అశోక్‌నగర్‌లోని సంఘ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి సమైక్య అధ్యక్షుడు వాసిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మైత్రి వెంకటరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌లో మరింత ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సామ శ్రీనివాస రెడ్డి, ఉడుముల తిరుపతిరెడ్డి, సానికొమ్ము వెంకటేశ్వర్ రెడ్డి (బీఎస్ఎన్ఎల్), కీసర శ్రీనివాసరెడ్డి, గుర్రం వెంకటరెడ్డి, శీరపు గణేష్ రెడ్డి, సామ శ్రీనివాస రెడ్డి (రైస్ మిల్), గ్యాస్ కొండారెడ్డి, గాయం అవినాష్ రెడ్డి, బంకు శ్రీనివాసరెడ్డి, రెడం శివశంకర్ రెడ్డి, శ్యామల అశోక్ రెడ్డి, దేవిరెడ్డి ఆదిరెడ్డి, సారం పెల్లి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరగగా.. పాల్గొన్న సభ్యులు మైత్రి వెంకటరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

## గజ ఈతగాడు కరుకు ప్రసాద్‌కు ఘన సత్కారం



**భద్రాచలం మహా :**గోదావరి నదిలో ప్రమాదవశాత్తు మునిగిపోతున్న అనేక మందిని ప్రాణాపాయ స్థితి నుంచి రక్షిస్తూ సేవా భావానికి ప్రతీకగా నిలిచిన గజ ఈతగాడు కరుకు ప్రసాద్‌ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఘనంగా సత్కరించారు.రవీంద్రభారతిలో అందుకున్న "సాహస రత్న" పురస్కారం, తిరుపతిలో పొందిన "నేషనల్ అవార్డు" నేపథ్యంలో ఆయన సేవలను గుర్తిస్తూ, ఎస్పీ ఈరోజు ప్రసాద్ కుటుంబాన్ని సతీసమేతంగా అభినందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు తన ప్రాణాలను పణంగా పెట్టే వారు సమాజానికి నిజమైన హీరోలని ప్రశంసించారు. కరుకు ప్రసాద్ లాంటి ధైర్యవంతులు యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. భద్రాచలం ప్రాంతానికి ఆయన చేసిన సేవలు గర్వకారణమని, ఇలాంటి సేవా తత్వం కలిగిన వారిని గుర్తించి ప్రోత్సహించడం సమాజం బాధ్యత అని ఎస్పీ తెలిపారు.

## మణుగూరు కోర్టుకు రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు..

- బార్ కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్, శైలజలకు ఘన స్వాగతం
- సభ్యులను సత్కరించిన న్యాయవాదులు
- న్యాయవాది సూర్యం కుటుంబానికి రూ.1.28 లక్షల ఆర్థిక సాయం



**మణుగూరు, మహా :**మణుగూరు కోర్టును ఐలు తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మందడపు శ్రీనివాస్, చందాల శైలజలు బుధవారం సందర్శించారు. వీరితో పాటు రాష్ట్ర నాయకులు, మాజీ బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, ఐలు జాతీయ సభ్యులు ఏడు నూతల శ్రీనివాస్, శివరామ ప్రసాద్‌లు విచ్చేయగా, మణుగూరు ఐలు శాఖ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు ఎన్నికైన మందడపు శ్రీనివాస్, చందాల శైలజలను మణుగూరు న్యాయవాదులు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఐలు సభ్యులు మాట్లాడుతూ, బార్ కౌన్సిల్ ద్వారా న్యాయవాదులకు అవసరమైన సేవలు, సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. న్యాయవాదుల సంక్షేమం, వృత్తి అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఐలు సభ్యులు పోశం భాస్కర్, పి కిషన్ రావు, జాడి చొక్కయ, ఎం శ్రీనివాస్ రావు, శైలజ, కవిత, సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

**- సూర్యం కుటుంబానికి ఆర్థిక సాయం..**

మణుగూరు బార్ అసోసియేషన్ సభ్యుడు సూర్యం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం విదితమే. కాగా మణుగూరు సందర్శించిన నూతన రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మందడపు శ్రీనివాస్, శైలజలు మణుగూరు బార్ అసోసియేషన్లోని ఐలు సభ్యుల సహకారంతో రూ.1.28 లక్షల ఆర్థిక సహాయాన్ని సూర్యం కుటుంబ సభ్యులకు అందజేశారు. దీంతోపాటు సూర్యం పిల్లల ఇంటర్మీడియట్ రెండు సంవత్సరాలకు సరిపడ కళాశాల ఫీజు తో పాటు దుస్తులు పుస్తకాల ఖర్చులను తానే భరిస్తానని ఈ సందర్భంగా కౌన్సిల్ సభ్యులు మందడపు శ్రీనివాస్ ప్రకటించారు. పిల్లలు తెలంగాణ రాష్ట్రంలోని ఏ కళాశాలలో చదువుకున్న ఖర్చులు తానే భరిస్తానని ఈ సందర్భంగా ప్రకటించడంతో ఐదు సభ్యులు హర్షం వ్యక్తం చేసి కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్కు కృతజ్ఞతలు తెలిపారు.

## మాదకద్రవ్యాలు,
## ధూమపానంకు దూరంగా ఉందాం

**సామాజిక అవగాహన కోసం ఫ్లాష్ మాబ్ నిర్వహించిన చైతన్య డీమ్డ్-టు-బి విశ్వవిద్యాలయ విద్యార్థులు**




**మొయినాబాద్ మహా :**సామాజిక బాధ్యతను చాటి చెబుతూ, యువతలో చైతన్యం పెంపొందించే లక్ష్యంతో,మొయినాబాద్ మున్సిపాలిటీ లోని హిమాయత్‌నగర్ చైతన్య డీమ్డ్‌టుబి విశ్వవిద్యాలయ విద్యార్థులు ఈ రోజు హైదరాబాద్ నగరంలోని ప్రముఖ కూడళ్లలో వరుసగా ఫ్లాష్ మాబ్ కార్యక్రమాలను నిర్వహించారు. యువతలో ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారుతున్న మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు ధూమపానం వల్ల కలిగే హానులపై అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశమని విశ్వవిద్యాలయ డైరెక్టర్ & చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సి.హెచ్. సాత్విక రెడ్డి తెలిపారు. ప్రజల దృష్టిని ఆకర్షించేందుకు ఈ ఫ్లాష్ మాబ్ ప్రదర్శనలు సంగీతం, నృత్యం మరియు ప్రభావవంతమైన దృశ్య సందేశాల సమ్మేళనంగా సాగాయి. ఒకే విధమైన దుస్తులు ధరించిన విద్యార్థులు సాధారణ పాదచారుల్లా కనిపిస్తూ, ఒక్కసారిగా సమకాలీన నృత్య ప్రదర్శనలలోకి మారడం ద్వారా మాదకద్రవ్యాల సమస్య సమాజంలో ఎలా దాగి ఉందో ప్రతిబింబించారు."మాదకద్రవ్యాలు వద్దు", "ధూమపానం వద్దు" వంటి బలమైన నినాదాలతో కార్యక్రమాన్ని ముగించారు. ఈ నినాదాలు రద్దీ కూడళ్లలో మార్మోగి, పెద్ద సంఖ్యలో ప్రజలను ఆకర్షించాయి.వినోదాత్మక ప్రదర్శనలతో పాటు, ఈ కార్యక్రమం లోతైన సామాజిక సందేశాన్ని కూడా అందించింది. ప్లకార్డులు, హావభావాలు, అభినయాల ద్వారా వ్యసనాల వల్ల కలిగే శారీరక, భావోద్వేగ మరియు సామాజిక ప్రభావాలను విద్యార్థులు స్పష్టంగా ప్రతిబింబించారు. మాదకద్రవ్యాలు మరియు ధూమపానం కుటుంబాలను ఎలా దెబ్బతీస్తాయో, వ్యక్తిగత జీవితాన్ని మరియు వృత్తిని ఎలా ప్రభావితం చేస్తాయో వివరించారు. అలాగే, తోటివారి ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యం, సరైన నిర్ణయాలు తీసుకోవడం, అవసరమైనప్పుడు సహాయం కోరడం వంటి అంశాల ప్రాముఖ్యతను విద్యార్థులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యం విశేషంగా కనిపించింది. అనేక మంది ప్రయాణికులు తమ ప్రయాణాలను ఆపి ప్రదర్శనను వీక్షించడం, వీడియోలు తీయడం, విద్యార్థులతో సంభాషించడం జరిగింది. సాంప్రదాయ అవగాహన కార్యక్రమాల కంటే ఇటువంటి ప్రత్యక్ష ప్రదర్శనలు మరింత ప్రభావవంతంగా ఉంటాయని పలువురు అభిప్రాయపడ్డారు.విద్యార్థుల సృజనాత్మకతను మరియు కృషిని అధ్యాపక బృందం, విశ్వవిద్యాలయ అధికారులు అభినందించారు. విద్యా సంస్థలు కేవలం విద్యాబోధనకే పరిమితం కాకుండా, సామాజిక స్పృహ కలిగిన పౌరులను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాయని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సామాజిక సమస్యలపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు విశ్వవిద్యాలయం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు మరియు అసిస్టెంట్ రిజిస్ట్రార్ & పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ గాదె రాంబాబు రెడ్డి పాల్గొన్నారు.

## మహిళలను ఆర్థికంగా బలపరచడమే కాంగ్రెస్ లక్ష్యం

- మహాలక్ష్మి పథకంతో 230 కోట్ల మహిళలకు ప్రయోజనం
- స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్



**సత్తుపల్లి, మహా:** మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ పార్టీ ప్రధాన అజెండా అని సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్.టి.సి సంవత్సరపు వార్షిక ఆదాయం రూ 10వేల కోట్ల రూపాయలను చార్జీల రూపంలో సంస్థకు చెల్లించామని ఎమ్మెల్యే అన్నారు. ఈ సందర్భంగా ఆర్.టి.సి డిపోలో ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల వ్యవధిలో మహిళలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసిన ఘనత సీ.ఎం రేవంత్ రెడ్డి కి దక్కిందని అన్నారు. మహిళల పట్ల మక్కువతో గృహజ్యోతి,సోలార్ పవర్ ప్లాంట్,రేషన్ కార్డులు,సన్న బియ్యం,అమ్మ ఆదర్శ పథకం, ఇందిరమ్మ ఇండ్లు వంటి బృహత్తర కార్యక్రమాలు మహిళలకు అందిస్తే ఆర్థికంగా ఎదుగుతారని ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి పథకాలను మహిళలకు అందించిందని అన్నారు. ఆర్.టి.సి బస్సులు కొరతగా తీర్చడానికి సంస్థకు 115 బస్సులను అందించామని, సత్తుపల్లి డిపో అభివృద్ధికి నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. మహాలక్ష్మి పథకంతో చిరుద్యోగులకు, షాపులలో పనిచేసే దినసరి కూలీలకు, ప్రయాణం చేసే మహిళలకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ప్రతి కుటుంబానికి సుమారు నాలుగు వేల రూపాయలు ఆదా అవుతుందని దీని ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధి పెరుగుతుందని తెలిపారు. అనంతరం ఆర్టీసీ డిపో ఆవరణలో మహిళలను సత్కరించి బహుమతులు అందజేశారు. అనంతరం ఆర్.టి.సి డి.ఎం లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గతంలో ఆర్.టి.సి సంస్థ ఉనికి ప్రశ్నార్థకంగా ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత అందించి సత్తుపల్లి డిపోకు రూ.84 కోట్ల రూపాయల ఆదాయ మార్గంలోకి తెచ్చిందని, డిపోకు నూతన బస్సుల రాకతో సర్వీసులను సమర్థవంతంగా నడుపుతున్నామని డిపో మేనేజర్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెహనా కమల్, వార్డ్ కౌన్సిలర్లు విరివాడ అపర్ణ, దూదిపాల రాంబాబు, జగన్నాథం శ్రీను, ఉప్పు నాగమణి, నసీమా షరీఫ్, ఆనంద్, కందిబండ సంధ్యారాణి, కాంగ్రెస్ నాయకులు గాదె చెన్నారావు తదితరులు ఉన్నారు.

## శాస్త్రిపురం పార్క్ స్థలంలో అక్రమ నిర్మాణాలు నేలమట్టం

**100 కోట్ల పార్కు స్థలాన్ని విముక్తి కల్పించిన హైడ్రా అధికారులు**





**రాజేంద్రనగర్ మహా ;** మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని శాస్త్రి పురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 134/20లో సుమారు 6,500 గజాల పార్కు స్థలాన్ని కబ్జా చేసి అక్రమంగా బహుళ అంతస్తుల నిర్మాణాలను హైడ్రాధికారులు గుర్తించి భారీ పోలీసుల బందో బస్తు మధ్య బుధవారం జెసిపి సహాయంతో బహుళ అంతస్తుల నిర్మాణాలను నేలమట్టం చేశారు. 188 ఎకరాల విస్తీర్ణంలో హుడా అనుమతి పొందిన లేఔట్ లో పార్కు స్థలంలో నోటరీ ఆధారంగా ప్లాట్లుగా మలిచి విక్రయించారు. విక్రయించిన ప్లాట్ లలో నిర్మాణాలు చేపట్టారు. జిహెచ్ఎంసి అధికారులు గతంలోనే నోటీసులు జారీలు చేశారు. గతంలోనే కూల్చివేతకు సంబంధించిన ఆదేశాలు జారీ అయినా. వాటిని బేఖాతరు చేస్తూ నిర్మాణాలు చేపట్టారు. పార్కు స్థలంలో నిర్మాణాలు చేపట్టినట్టు స్పష్టంగా గుర్తించిన అధికారులు వీటిని కూల్చివేశారు. ఈ భూమి విలువ సుమారు 100 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా.

## నక్కలపల్లి గ్రామ అభివృద్ధిలో కీలక మైలురాయి




**మొయినాబాద్ మహా:** నక్కలపల్లి గ్రామ అభివృద్ధిలో భాగంగా మరో ముఖ్యమైన ముందడుగు పడింది. గ్రామంలో 5 లక్షల హెచ్ఎండిఏ నిధులతో 100 వీధి దీపాలను ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ శ్రీ మంగళారం యదయ్య ఘనంగా ప్రారంభించారు .ఈ సందర్భంగా మొయినాబాద్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు & ఉప సర్పంచ్ గౌండ్ల నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ, గ్రామంలో వీధి దీపాల ఏర్పాటు వల్ల రాత్రి సమయంలో ప్రజలకు మెరుగైన వెలుగు లభిస్తుందని తెలిపారు. ఇది గ్రామ భద్రతకు మరియు అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. అలాగే ప్రభుత్వం చేపడుతున్న ప్రజాపాలనలో గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. గ్రామం వెలుగులతో నిండిపోవడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ నూతన పాలక వర్గాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంగళారం యదయ్య గారు, ఉప సర్పంచ్ నిరంజన్ గౌడ్ గారు, వార్డు సభ్యులు మల్లేష్, జీవన్, తేజశ్రీ, పంచాయతీ కార్యదర్శి యాదగిరి గారు, నాయకులు గౌరి రవి, రాజు గౌడ్, నవీన్, భాను గౌడ్, శ్రీకాంత్, విశాల్, సమీర్, జంగయ్య, సుధాకర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ విజయశాంతిని కలసిన తెలంగాణ ఉద్యమకారులు



**కుషాయిగూడ, మహా :** అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్సీ విజయశాంతి తెలంగాణ ఉద్యమకారుల సమస్యలను లేవనెత్తిన నేపథ్యంలో ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమెను కలసి తమ కృతజ్ఞతలను తెలిపారు. గత పదేళ్ళుగా బీఆర్ఎస్ ఉద్యమకారులను విస్మరించి, మోసం చేసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారుల సమస్యలను కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల ప్రకటనలో చేర్చినప్పటికీ, రెండు సంవత్సరాలు గడిచినా పరిష్కారంపై చర్యలు తీసుకోలేదని విమర్శించారు. అసెంబ్లీలో 119 మంది ఎమ్మెల్యేలు, మండలిలో 40 మంది ఎమ్మెల్సీలు ఉన్నప్పటికీ ఉద్యమకారుల సమస్యలను ఎవరూ ప్రస్తావించకపోవడం బాధాకరమని తెలిపారు. కేవలం విజయశాంతితో పాటు సీపీఐ నాయకుడు కూనంనేని సాంబశివరావు, కాంగ్రెస్ ఎమ్మెల్యే మందుల సామ్యూల్, రామ్మోహన్ రెడ్డి మాత్రమే స్పందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ మిగతా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు తమ బాధ్యతలను ఎందుకు నిర్వర్తించడం లేదని ప్రశ్నించారు. సమస్యలపై స్పందించకపోతే వారి ఇళ్లను ముట్టడి చేసి, గేరావ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి, సుల్తాన్ యాదగిరి, మల్లారి అనిల్ కుమార్, రామగిరి ప్రకాష్, గుండా యాదగిరి, సామ అంజిరెడ్డి, చంద్రన్న ప్రసాద్, కంచర్ల బద్రి, మోత్కూరి మల్లేష్, బీరకాయల మధుసూదన్, పుట్టా రంజిత్, బోయపల్లి రంగారెడ్డి, శంకర్రావు, హరిప్రసాద్, సత్యం, రాజు, గంధమాల యాదగిరి, యనమల రవి, ఎర్ర జాన్సన్, అంజలి కుమారి, బాకారం లావణ్య, లక్ష్మి కాంతమ్మ, ఓగిరాల సుజి, లలిత, పుష్ప, దుర్గాని శ్యామల, కమల, అరుణ, స్వరూప, భాస్కర్, మోజేష్ తదితరులు పాల్గొన్నారు.

# భార్యాభర్తల మధ్య విభేదాలు

## వైద్యుడి ఆత్మహత్య



**కుషాయిగూడ, మహా :** కీసర మండలం అహ్మద్‌గూడలోని శ్రీ లక్ష్మీ ఎన్‌క్లేవ్‌కు చెందిన భార్యాభర్తల మధ్య నెలకొన్న కుటుంబ విభేదాలు విషాదాంతానికి దారి తీశాయి. పి. వీణపాణి, ఆమె భర్త డా. జోసెఫ్ వినోద్ కుమార్ (40) మధ్య కొంతకాలంగా గొడవలు కొనసాగుతున్న నేపథ్యంలో, మార్చి 31న వీణపాణి ఫిర్యాదు మేరకు కీసర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అదే రోజు సాయంత్రం 7:30 గంటల సమయంలో జోసెఫ్ వినోద్ కుమార్ తండ్రి పసల ఆరోగ్యమయ్య పోలీసులను ఆశ్రయించి, తన కుమారుడు భార్య చేత మానసిక వేధింపులకు గురై, మధ్యాహ్నం 3 గంటల సమయంలో రాంపల్లి దయారా ఔటర్ రింగ్ రోడ్ వద్ద కారులో గుర్తుతెలియని ఇంజెక్షన్ ద్వారా ఆత్మహత్య చేసుకున్నాడని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు మరో కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం పరీక్ష నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.రెండు కేసులను అనుసంధానించి అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నామని, సాక్ష్యాధారాల ఆధారంగా తగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కీసర ఇన్‌స్పెక్టర్ ఆర్కపల్లి అంజనేయులు తెలిపారు.

# బీర్ల అయిలయ్య చిత్రపటానికి పాలాభిషేకం



**యాదగిరిగుట్ట, మహా:** ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య చిత్ర పటానికి బుధవారం యాదగిరిగుట్ట వైకుంఠ ద్వారం వద్ద పాలాభిషేకం చేశారు యాదాద్రి భువనగిరి జిల్లా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో పని చేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు...మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం తెలంగాణ టెక్నికల్ అసిస్టెంట్ల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించినందుకు గాను ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు...మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్లకు ఎలాంటి ఉద్యోగ భద్రత లేకపోవడం ,రిటర్మెంట్ బెనిఫిట్స్ లేకపోవడం,ప్రతి నెల జీతాలు రావడం లేదని గతంలో యాదాద్రి లో రాష్ట్ర స్థాయిలో టెక్నికల్ అసిస్టెంట్ సమావేశం ఏర్పాటు చేసినప్పుడు ప్రభుత్వం విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హాజరయారని గుర్తు చేశారు..టెక్నికల్ అసిస్టెంట్ లకు అండగా ఉండి సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినందుకు కృతజ్ఞతగా ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు పాలభిషేకం చేశామన్నారు..టెక్నికల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరం అయ్యే వరకు తమకు అండగా ఉండాలని కోరారు.. సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు... కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొండమడుగు రమేష్,ప్రధాన కార్యదర్శి కోడి త్యాల నాగరాజు,కోశాధికారి యెల్లోజు రామచంద్రచారి ,టెక్నికల్ అసిస్టెంట్ లు,యాదాద్రి భువనగిరి జిల్లా డీసీసీ జనరల్ సెక్రెటరీ కానుగు బాలరాజు గౌడ్,యాదగిరిగుట్ట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బంధారపు భిక్షపతి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుండ్లపల్లి భారత్ గౌడ్,మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం,తదితరులు పాల్గొన్నారు

# ఆలేరులో చికెన్ షాపులు బంద్



**ఆలేరు, మహా:**యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో బుధవారం నుండి చికెన్ షాపులు బంద్ నిర్వహిస్తున్నారుఫౌల్ట్రీ కంపెనీలు మార్జిన్ తగ్గించాయని నిరసన వ్యక్తం చేస్తు ఈ నిర్ణయం తీసుకున్నారుఈ మేరకు గౌడ సంఘంలో విలేకరుల సమావేశం నిర్వహించారుచికెన్ విక్రయాల్లో మార్జిన్ ఇంతకు ముందులా 23 రూపాయలకు పెంచాలని షాపుల ఓనర్స్ డిమాండ్‌చేస్తున్నారుతగ్గించిన మార్జిన్ పెంచేవరకు నిరవధిక బంద్ పాటిస్తామనిఫౌల్ట్రీ కంపెనీలు దిగివచ్చే వరకు బంద్ కొనసాగిస్తామని చికెన్ షాపుల యజమానులు హెచ్చరించారు.షాపుల ఓనర్లు రమేష్, నర్సింహ్మా,బాబా ,అంకుశ్,ఇబ్రాహీం తదితరులు ఉన్నారు.

# జిల్లా కోర్టు అభివృద్ధికి కృషి చేస్తా...

## నూతన బార్ అధ్యక్షులు విద్యా సాగర్



**భువనగిరి, మహా:**యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా నసంగి విద్య సాగర్ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారుఆయనతో పాటు నూతన కార్యవర్గం కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు ఈ సందర్బంగా అధ్యక్షుడు విద్యా సాగర్ మాట్లాడుతూ జిల్లా కోర్ట్ అభివృద్ధి కొసం తన వంతు కృషి చేస్తా అని హామి ఇచ్చారు ఈ కార్యక్రమం లో కార్యవర్గ సభ్యులు ఉపాధ్యక్షులు శరద్, ప్రధాన కార్యదర్శిగా మేడబోయిన యాదగిరి, జాయింట్ సెక్రటరీ గా ఉడతల సురేష్‌గౌడ్ ,కోశాధికారిగా చందుపట్ల రజినిలు ప్రమాణ చేశారు.

# పార్కింగ్ వివాదం.. యువకుడిపై దాడి



**కుషాయిగూడ, మహా :** పార్కింగ్ విషయంలో చోటు చేసుకున్న చిన్న వివాదం ఘర్షణకు దారి తీసి, ఒక యువకుడిపై దారుణ దాడి జరిగిన ఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. డాక్టర్ ఏఎస్ రావు నగర్‌లోని పరివార్ హోటల్ సమీపంలో ఉన్న రిలయన్స్ డిజిటల్ ప్రాంగణంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. బైక్‌ను పక్కకు జరపమని చెప్పినందుకు కుషాయిగూడకు చెందిన మామిడి సంతోష్ గౌడ్‌పై ఢిల్లీ, ఝార్ఖండ్‌కు చెందిన జస్వంత్, పార్థ్ కుమార్‌లు తీవ్రంగా దాడి చేశారు. చేతికి ధరించే ఇనుప కడియంతో ముక్కుపై బలంగా గుద్దడంతో సంతోష్ గౌడ్ ముక్కు ఎముకలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ముక్కులోని ఎముకలు తునాతునకలయ్యాయని వైద్యులు తెలిపారు. బాధితుడికి ఐదు శస్త్రచికిత్సలు అవసరమని పేర్కొన్నారు. గాయపడిన సంతోష్ గౌడ్ ప్రస్తుతం ఈసీఐఎల్ చౌరస్తాలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి ఆసుపత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. ఈ ఘటనపై కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇప్పటివరకు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

# కొత్త వీధిధీపాలు అమర్చిన మున్సిపల్ ఛైర్మన్ భీజన బాలమణి భాస్కర్



**ఆలేరు, మహా:**యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీలోని మెన్ రోడ పైబుధవారం సాయంత్రం కొత్త ఐ మార్క్స్, బటర్ ఫ్లై లైట్లను మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు దగ్గరుండి వేయించారు... మున్సిపల్ ఎన్నికల్లో ఆలేరు పట్టణం ప్రజలకు ఇచ్చిన వాగ్దానానికి కట్టుబడి మెన్ రోడ్డు పై లైటింగ్ వ్యవస్థను మెరుగు పరచడానికి నేడు శ్రీకారం చుట్టారుఆలేరు దుర్గా మాత ఆలయం నుండి పాలకేంద్రం వరకు పని చేయని వీధి దీపాల స్థానంలో కొత్త లైట్లు అమర్చారు...ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బీజన బాలమణి భాస్కర్, వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు,కౌన్సిలర్లు వనరాశి మరియమ్మ మార్క్,జూకంటి సంపత్, జెట్ట నీరజ,వస్తం ఆంజనేయులు,యాట శివా,బిజన కళ్యాణి మధు,బొట్ల సంపత్,పాశికంటి సంపత్,పాకాల మౌనిక హరిష్,లో పాటు మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం ఎస్ విజయ్ కుమార్,MDజైనొద్దిన్,పట్టణ అధ్యక్షులు ఎంఏ ఏజాజ్,జావేద్ తదితరులు పాల్గొన్నారు...

# జవహర్ నగర్ లో చికెన్ షాపుల యజమానుల నిరసన



**కుషాయిగూడ, మహా :** పౌల్ట్రీ కంపెనీల ఆగడాలకు నిరసనగా జవహర్ నగర్ లోని చికెన్ షాప్ యజమానులు నిరసన తెలిపారు. ఈ మేరకు జవహర్ నగర్ లోని చికెన్ షాపుల యజమానులు సంపూర్ణంగా బుధవారం బంద్ చేపట్టి ర్యాలీగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా చికెన్ షాపుల యజమానులు మాట్లాడుతూ చికెన్ షాపుల నిర్వహణ దినదిన గండంలా మారుతుందని పెట్టుబడి కూడా దక్కడం లేని తమ ఆవేదన వ్యక్తం చేశారు. చికెన్ షాప్ యజమానుల బాధను ప్రభుత్వం పట్టించుకోని గిట్టుబాటు ధర దక్కేలా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ లోని చికెన్ షాపుల నిర్వాహకులు పాల్గొన్నారు.

# కంఠమయ్య గుడిని అభివృద్ధి చేయాలి

## కలెక్టర్ కు కలిసి వినతిపత్రం అందచేసిన ఉప్పల్ ఎంఎల్ఏ



**కుషాయిగూడ, మహా :** గౌడ కులస్తుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం కుషాయిగూడలో గౌడ కులస్థుల ఆరాధ్యదైవమైన శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయం అభివృద్ధి కోసం యుద్ధ ప్రాతిపదికన రెండు కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేయాలని మేడ్చల్ కలెక్టర్ మను చౌదరికి కుషాయిగూడ గౌడ సంఘం నాయకులతో వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలోఎంఎల్ఏతో పాటు చర్లపల్లి డివిజన్ సీనియర్ నాయకులు పాండల శివకుమార్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు నేమురి మహేష్ గౌడ్, గౌడ సంఘం నాయకులు కాసుల పోచయ్య గౌడ్ అక్క అక్క కాసుల రవీందర్ గౌడ్ కాసుల సురేందర్ గౌడ్తాళ్ల వెంకటేష్ గౌడ్, బుడంపల్లి రఘు గౌడ్ తదితరులు పాల్గొన్నారు..

# సిఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు...

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్



**ఆలేరు, మహా:**న్యాయవాదుల రక్షణ కోసం అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లు తెచ్చి అమలు చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆలేరు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు పి వి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు..అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్న అందరికి ఆయన ధన్యవాదాలు తెలుపుతూ అందరి సహకారంతో నూతన కోర్టు భవనానికి కృషి చేస్తానన్నారు...యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం నేడు కోర్టు ఆవరణలో ప్రమాణ స్వీకారం చేశారు...నూతన అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కార్యవర్గం చేత ఎన్నికల అధికరి వనంరాజు ప్రమాణం చేయించి పూల మాలలు శలువాలతో ఘనంగా సత్కరించారు...ఈ కార్యక్రమంలో బార్ మాజీ అధ్యక్షులు జూకంటి రవి,గొట్టిపాముల బాబురావు,సీస శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రావుల రవి,ప్రధాన కార్యదర్శి బి .రాజు,కోశాధికారి రవి కుమార్ఏజిపి హరిబాబు పలువురు న్యాయ వాదులు సంపత్ కుమార్, రమేష్, గురు మూర్తి, ఎం కృష్ణ లు పాల్గొన్నారు...సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సీనియర్ న్యాయవాదులు ,కోర్టు సిబ్బంది, జర్నలిస్టులు ,పోలీసులు శాలువాలతో సన్మానించారు.

# ప్రభుత్వ ఆస్పత్రిలో పేషెంట్లకు మెరుగైన సేవలు అందించాలి

## జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**ఆలేరు, మహా:**ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్లకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.బుధవారం ఆలేరు మండలం శారజీపేట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు .ఈ సందర్భంగా ఆసుపత్రి లోని వార్డును పరిసరాలను, క్షుణ్ణంగా పరిశీలించారు. పరిశుభ్రత పై ప్రత్యేక దృష్టి సారించాలని , ప్రతిరోజూ శానిటేషన్ పనులు క్రమం తప్పకుండా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.ఆసుపత్రి లో ఎంత మంది పనిచేస్తున్నారని,సిబ్బంది సంఖ్య, వారి హాజరు వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రతి సిబ్బంది విధిగా విధులకు హాజరు నమోదు చేసుకుంటున్నారా లేదా అనే విషయాన్నిడైలీ అటెండెన్స్ లాగిన్ ద్వారా కలెక్టర్ పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు.ప్రతి రోజు ఓపి (OP)కి వచ్చే రోగుల సంఖ్య, వారి వివరాలను ఎలా నమోదు చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. రోగుల రిజిస్టర్‌ను సరిగా నిర్వహించాలనీ, ప్రతి రోగి వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు.ఆసుపత్రిలో అవసరమైన ఔషధాలు సరిపడా ఉన్నాయా లేదా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసు కున్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు.రోగులకు అందిస్తున్న మందుల వివరాలను సక్రమంగా రికార్డు చేస్తున్నారా అనే అంశాన్ని కూడా పరిశీలించారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు.ఈ కార్యక్రమం లో జిల్లా వైద్య అధికారి మనోహర్, వైద్యఅధికారులు, సిబ్బంది సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పల్లె ప్రగతిపై కలెక్టర్ 'సుడిగాలి' పర్యటన..

## నర్సరీలు, ఉపాధి పనులు పరిశీలించిన కలెక్టర్ చంద్రశేఖర్..

## స్కూళ్లలో కట్టెల పొయ్యిపై వంట వద్దు.. గ్యాస్ వాడాల్సిందే..



**నకిరేకల్, మహా :** పల్లెల్లో ప్రభుత్వ పథకాల అమలు తీరు, అభివృద్ధి పనుల నాణ్యతపై జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బుధవారం సుడిగాలి పర్యటన చేశారు. శాలిగౌరారం మండలంలోని వల్లాల, అడ్లూరు గ్రామాల్లో పర్యటించిన ఆయన నర్సరీల నుంచి అంగన్‌వాడీ కేంద్రాల వరకు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టారు. ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులను ఆదేశించారు. ముందుగా వల్లాల గ్రామంలోని వనమహోత్సవం నర్సరీని కలెక్టర్ సందర్శించారు. రానున్న వర్షాకాలంలో నాటాల్సిన 13,800 మొక్కల లక్ష్యంపై ఏపీఎం, ఏపీవోలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామసభలు నిర్వహించి ప్రజల అభిప్రాయం మేరకు అవసరమైన మొక్కలను పెంచాలని నాటాల్సిన స్థలాలను ముందే గుర్తించి జియో ట్యాగింగ్ చేయాలని సూచించారు. అనంతరం పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించి గ్రామస్థుల వాకింగ్ కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు.

**ఉపాధి హామీ కూలీలకు నీడ, తాగునీరు కచ్చితంగా ఏర్పాటు చేయాలి..**


వల్లాల చెరువులో ఉపాధి హామీ కింద జరుగుతున్న ఫిష్ పాండ్ తవ్వకం పనులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఎండల దృష్ట్యా కూలీలు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఆయన పని ప్రదేశంలో కచ్చితంగా తాగునీరు, నీడ సౌకర్యం కల్పించాలని డీఆర్‌డీఓ శేఖర్ రెడ్డిని ఆదేశించారు. ఎక్కువ పని చేస్తేనే ఎక్కువ వేతనం వస్తుంది ఉదయాన్నే పనులకు వచ్చి ఎండ ముదరకముందే పూర్తి చేసుకోవాలని కూలీలకు సూచించారు. గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లు, పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు.

**మోడల్ స్కూల్‌లో కట్టెల పొయ్యిపై ఆగ్రహం..**

తెలంగాణ మోడల్ స్కూల్‌ను సందర్శించిన కలెక్టర్ అక్కడ విద్యార్థులకు కట్టెల పొయ్యిపై వంట వండుతుండటం చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కట్టెల వాడకం నిలిపివేసి గ్యాస్ వాడాలని ప్రిన్సిపల్ కృష్ణమోహన్‌ను ఆదేశించారు. పాఠశాలలోని ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతులు చేయించాలని, డ్యూయల్ డెస్క్‌లను అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. పీఎం శ్రీ కింద ఎంపికైనందున పాఠశాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు.

**అంగన్‌వాడీ భవనాలు పూర్తి చేయాలి**

అడ్లూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. అద్దె భవనాల్లో ఉన్న కేంద్రాలకు ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద మంజూరైన సొంత భవనాల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామంలో ఆగిపోయిన డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, మిషన్ భగీరథ నీటి సమస్యలను సర్పంచ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి, తహసీల్దార్ వరప్రసాద్, ఎంఈఓ సైదులు తదితరులు పాల్గొన్నారు.



మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | గురువారం, హైదరాబాద్ | 02-04-2026
ANN తెలుగు







# 1950 నాటి రాజకీయం

మలయాళ అగ్ర హీరో టొవినో థామస్, కయాదు లోహర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పీరియాడిక్ చిత్రం 'పళ్లిచట్టంబి' ఈ నెల 10న పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. డిజో జోస్ ఆంటోని దర్శకుడు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో చిత్ర నాయకానా యికలు టొవినో థామస్, కయాదు లోహర్ విలేకరులతో మాట్లాడారు. సోషియో పొలిటికల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా తెరకెక్కిందని, 1950 నాటి పరిస్థితులకు అద్దం పడుతుందని తెలిపారు. టొవినో థామస్ మాట్లాడుతూ '1950 దశకంలో కేరళలో జరిగిన సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఫిక్షనల్ స్టోరీ ఇది. అప్పటి సామాజిక పరిస్థితులను చూపించాం. అన్నింటికంటే మానవత్వం ముఖ్యమనే అంశాన్ని ఈ సినిమాలో ఆవిష్కరించాం. ఎక్కడా మతాల ప్రస్తావన ఉండదు. చర్చి నేపథ్యంలో కొన్ని సన్నివేశాలుంటాయి' అన్నారు. ఈ సినిమాలో తాను రెబెకా అనే ఇంటెలెక్చువల్ మహిళ పాత్రలో కనిపిస్తానని, తన కెరీర్‌ను మరింత ముందుకు తీసుకెళ్లే క్యారెక్టర్ ఇదని తెలిపింది. తన పాత్రలో సహజత్వం కోసం ఎంతో పరిశోధన చేశానని, కొన్ని పుస్తకాలను కూడా చదివానని కయాదు లోహర్ పేర్కొన్నది.

# నయనతార.. ఒరిజినల్ పాన్ ఇండియా స్టార్

పాన్ ఇండియా హీరోయిన్ అనే ట్యాగ్‌కి నిజమైన అర్హత సాధించిన నటి నయనతార. ఒక్కో భాషలో ఒక్కో సినిమా చేస్తూ, ఐదు భాషల్లో ఒకేసారి సినిమాలు చేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం నయనతార తెలుగులో ఒక సినిమా షూటింగ్ దశలో ఉంది. మలయాళంలో రెండు సినిమాలు సెట్స్‌పై కొనసాగుతున్నాయి. తమిళంలో రెండు సినిమాలు రెడీ అయ్యాయి. మరో సినిమా షూటింగ్‌లో ఉంది. కన్నడలో ఆమె నటించిన టాక్సిక్ సినిమా రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. ఇక హిందీ బాలీవుడ్‌లో సల్మాన్ ఖాన్ సరసన నటించేందుకు సైన్ చేసింది. ఇంతకుముందు షారూక్ ఖాన్‌తో కలిసి జవాన్ చిత్రంలో నయనతార నటించింది. ఇప్పుడు సల్మాన్‌తో కలిసి వంశీ పైడిపల్లి దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో కీలక పాత్ర పోషించనుంది. ఇందులో కూడా ఆమె పాత్రకు యాక్షన్ టచ్ ఉండనుందని సమాచారం. ఇలా ఒకేసారి ఐదు భాషల్లో సినిమాలు చేస్తూ నిజమైన పాన్ ఇండియా హీరోయిన్‌గా నిలుస్తోంది నయనతార. నయనతార ఈ స్థాయికి రావడానికి గల కారణాల్లో ఆమె సినిమాల ఎంపికలో చూపే వైవిధ్యం ఒకటి. తన నటనతో ఇప్పటికే దక్షిణాది భాషల్లో బలమైన స్థానం సంపాదించుకున్న ఈ నటి ఇప్పుడు బాలీవుడ్‌లో కూడా తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకునే ప్రయత్నంలో ఉంది.

# ఆ అవకాశం ఇప్పటివరకూ రాలేదు

## మాళవికా నాయర్

''చిత్ర పరిశ్రమలో ఇన్నేళ్ల నా సినీ ప్రయాణం పట్ల ఒక నటిగా హ్యాపీగా ఉన్నాను. అయితే సంతృప్తిగా లేను. నేను పూర్తి స్థాయిలో సంతృప్తి చెందే పాత్ర చేసే అవకాశం ఇప్పటివరకు రాలేదు. ఇంకా మంచి పాత్రలు చేయాలని కోరుకుంటున్నాను. అయితే 'బైకర్' సినిమాలో నటనకి ప్రాధాన్యం ఉన్న పాత్ర చేశాను. ఈ చిత్రం కుటుంబ ప్రేక్షకులకు ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతుంది'' అని హీరోయిన్ మాళవికా నాయర్ చెప్పారు. శర్వానంద్, మాళవికా నాయర్ జోడీగా నటించిన చిత్రం 'బైకర్'. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహించారు. విక్రమ్ సమర్పణలో యూవీ క్రియేషన్స్‌పై వంశీ-ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదల కానుంది. ఈ సందర్భంగా మాళవికా నాయర్ విలేకరులతో మాట్లాడుతూ- ''బైకర్' కథ మూడు టైమ్‌లైన్స్‌లో సాగుతుంది. నా పాత్ర కూడా ఇన్‌వాల్వ్ అవుతూ ఉంటుంది.

రేసింగ్ బ్యాక్‌డ్రాప్ సినిమా అయినప్పటికీ మంచి ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా ఉన్నాయి. తండ్రీ కొడుకుల భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. ఈ సినిమా స్ఫూర్తినిస్తుంది. ఇక ప్రతిసారీ కొత్త క్యారెక్టర్ చేయాలని ఉండటం వల్లే గ్యాప్ వస్తోంది. ఓ పాత్ర చేసే ముందు ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుంటాను... కొత్తగా అనిపిస్తేనే చేస్తాను'' అని తెలిపారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com